RNI
TEL TEL / 2023/ 84132

# అక్షర సవాల్

సామాన్యుడు ప్రశ్నించే గొంతుక

ప్రచురణ-హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ ఎడిటర్: బాదావత్ బాలాజి సంపుటి :04 సంచిక :55 శనివారం 23 మే 2026 పేజీలు -8 వెల రూ 5-00

## నిమ్స్‌లో 2000 కిడ్నీ మార్పిడిలు..

**వైద్య బృందానికి సీఎం రేవంత్ అభినందనలు**



**హైదరాబాద్, మే 22:** కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో అరుదైన మైలురాయిని అందుకున్న నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్( కిడ్నీ మార్పిడిలలో దేశంలోనే అరుదైన రికార్డు నమోదు చేసింది. నిమ్స్ యూరాలజీ విభాగం ఇప్పటివరకు 2,000 కిడ్నీ మార్పిడులు పూర్తి చేసింది. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో దక్షిణ భారత దేశంలో నిమ్స్? నంబర్ వన్‌గా నిలిచింది. దేశంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో గుజరాత్‌లోని ఐకేడీఆర్‌సీ మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో లూథియానా క్రిస్టియన్ కాలేజీలో ఉండగా.. - మిగతా5లో

రిపోర్టర్లు కావలెను
ఈ క్రింది పోస్టులకు అనుభవజ్ఞులు కావలెను
సబ్ ఎడిటర్లు - 02
బ్యూరో చీఫ్ (ఉమ్మడి వరంగల్ జిల్లా) - 01
స్టాఫ్ రిపోర్టర్లు - 06 (జనగాం, మానుకోట, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ)
అడ్వర్టైజ్‌మెంట్ మేనేజర్ - 01
యాడ్ ఆఫీసర్స్ - 02
సర్క్యూలేషన్ ఆఫీసర్ - 01
అనుభవాన్ని బట్టి వేతనం ఇవ్వబడును.
ఇంకెందుకు ఆలస్యం...
9347332442, 8096677136 నంబర్‌కు
వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

## జూన్ 2నుండి కొత్త పెన్షన్ల పంపిణీ



తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త పెన్షన్లు.. ఇందిరమ్మ ఇళ్లు.. రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్న వారికి తీపి కబురు అందించింది. ఇప్పటికే వీటి కోసం దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్న వారి సంఖ్య గణనీయంగా ఉంది. కాగా, బడ్జెట్ లో ఇప్పటి కే ప్రకటించిన రెండు లక్షల పెన్షన్ల తో పాటుగా రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం నిర్ణయించింది. దరఖాస్తులు.. అర్హతల పైనా నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో ప్రభుత్వం వీటికి సంబంధించి మరో ముఖ్య నిర్ణయంతో ముందుకు వెళ్తోంది. తెలంగాణలో కొత్త పెన్షన్లు.. ఇందిరమ్మ ఇళ్లు.. రేషన్ కార్డుల కోసం వేచి చూస్తున్న లబ్దిదారులకు ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీ నుంచి రెండు లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ ప్రకటించారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో నూతనంగా 2లక్షల మందికి పింఛన్లు మంజూరు కోసం బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, వేగవంతంగా దిగుమతులు చేయించేందుకు అధికారులు, మిల్లర్లను సమన్వయం చేస్తూ చర్యలు చేపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం రాష్ట్రవ్యాప్తంగా పూర్తయి గృహ ప్రవేశాలు అవుతున్నాయని వివరించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ జూన్‌లో ప్రారంభవుతుందని ఆయన తెలిపారు.

## తెలంగాణలో గ్రామాల అభివృద్ధికి బ్యాంకులు భాగస్వాములు కావాలి

**: మంత్రి తుమ్మల**



**హైదరాబాద్, మే 22:** తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు చురుకైన భాగస్వాములు కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గ్రామీణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని బ్యాంకులు ఉపయోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. 'తెలంగాణలో క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తి రికార్డు స్థాయిలో 130.78 శాతం నమోదు కావడం గొప్ప విశేషం. ప్రస్తుతం రాష్ట్రంలో బ్యాంక్ డిపాజిట్లు రూ.9.43 లక్షల కోట్లుగా ఉంటే, అడ్వాన్సులు (రుణాలు) రూ.12.33 లక్షల కోట్లకు చేరాయి. వ్యవసాయ రంగానికి రుణాల పంపిణీలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించింది. నిర్ణీత లక్ష్యం కంటే ఎక్కువగా 102 శాతం ప్రగతిని నమోదు చేయడం హర్షణీయం. రాష్ట్రంలో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరిందని, వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ.1.68 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందజేశాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రుణ సంస్కృతి తిరిగి పునరుద్ధరించబడింది. ప్రభుత్వ నిర్ణయాల వల్ల బ్యాంకులలో వ్యవసాయ నిరర్థక ఆస్తులు (మొండి బకాయిలు) 5.23 శాతం నుంచి 4.71 శాతానికి తగ్గాయి. తెలంగాణలో -- మిగతా5లో

## తెలుగు రాష్ట్రాల్లో మంత్రి వర్గ విస్తరణం

**హైదరాబాద్, మే 22:** మంత్రి వర్గ విస్తరణ, ప్రక్షాళన..ఈ ఊహాగానాలు..సెంట్రల్ టు స్టేట్ వరకు పొలిటికల్ ఇంట్రెస్టింగ్‌గా మారాయి. తెలంగాణ క్యాబినెట్ విస్తరణపై ఎప్పటికప్పుడు కొత్త అప్‌డేట్ వస్తూనే ఉంది. చివరకు ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ముహూర్తం ఫిక్స్ చేశారని..జూన్ ఫస్ట్ వీక్‌లో క్యాబినెట్ షఫ్లింగ్, ఎక్స్‌ప్యాన్షన్ ఉంటుందని బలమైన టాక్ వినిపిస్తోంది. సేమ్ టైమ్ అటు సెంట్రల్ క్యాబినెట్ షఫ్లింగ్ కూడా పక్కా అంటున్నారు. దీంతో ఇటు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలకు..కేంద్రంలో పవర్‌లో ఉన్న బీజేపీ నేతలకు కుర్చీ టెన్షన్ పట్టుకుందట.రెండు పార్టీలలో ఇదే అంశంపై చర్చ జరుగుతోంది. ఇంతలోనే గురువారం కేంద్ర క్యాబినెట్ భేటీ జరిగింది. ఇక 23న తెలంగాణ మంత్రివర్గ సమావేశం ఉన్న నేపథ్యంలో ఇదే వారికి చివరి



సమావేశం అవుతుందనే టాక్ -- మిగతా5లో

## రెండు ప్యాకేజీలుగా రీజినల్ రింగ్ రోడ్డు

**హైదరాబాద్ మే 22:** తెలంగాణ ప్రభుత్వం కేంద్రం సహకారంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో కీలక ముందడుగుపడింది. కేంద్రం ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగం పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.. 5 ప్యాకేజీలను 2 ప్యాకేజీలుగా కుదించి వేర్వేరుగా ఎన్‌హెచ్‌ఏఐ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ రీజినల్ రింగ్ రోడ్డు మొత్తం 161.518 కిలోమీటర్లు ఆరు వరుసలుగా రూ.9,362.4 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఈ రీజినల్ రింగ్ రోడ్డు టెండర్లకు సంబంధించి జులై 7వ తేదీ ఉదయం 11 గంటల వరకు గడువు ఉంది.. ఆలోపు ఆన్‌లైన్‌లో బిడ్‌లను సమర్పించాలని అధికారులు సూచించారు. ఆ మరుసటి రోజు బిడ్‌లు తెరుస్తారు. డిజైన్, బిల్ట్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన ఈ ఆర్‌ఆర్‌ఆర్ పనులు చేపట్టాల్సి ఉంటుందని ఎన్‌హెచ్‌ఏఐ నోటిఫికేషన్‌లో తెలిపింది.ఈ ఆర్‌ఆర్‌ఆర్ సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్‌లో మొదలై.. యాదాద్రి భువనగిరి జిల్లా



తంగడ్‌పల్లి దగ్గర ముగుస్తుంది. ప్యాకేజీ 1లో 83.518 కిలోమీటర్లు పొడవున సంగారెడ్డి -- మిగతా5లో

## బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తాం

**హరీష్ రావు**



**హైదరాబాద్:** బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఫార్మా సిటీకే కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి ఇచ్చింది. డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని పార్లమెంట్ చట్టంలో ఉంది. హై కోర్టులో ఈ మధ్య ఒక కేసులో తాము ఫార్మా సిటీని కంటిన్యూ చేస్తున్నామని రేవంత్ ప్రభుత్వం చెప్పింది. రేవంత్ ప్రభుత్వం కేవలం డ్రామా మాత్రమే చేస్తుంది. ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలి. 75 శాతం ఫార్మా సిటీ ఉండి, 25 శాతం మిగతావి ఉండాలి. కానీ 75 శాతం మిగతా వ్యాపారం, కేవలం 25 శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారు.. ఇది చట్ట ప్రకారం చెల్లదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది. మేము ప్రభుత్వంలోకి వచ్చాక ఫ్యూచర్ సిటీని 100 శాతం రద్దు చేస్తాం. ఫార్మా సిటీని రీస్టోర్ చేస్తాం.. ఇది నా మాట కాదు, పార్లమెంట్ చట్టం ఇదని అన్నారు.ఫార్మా సిటీ వస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని మేము ప్రారంభించాం. మన దగ్గర నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటికి వెళ్లొద్దని చేశాం. ఇప్పటికే రెండున్నర ఏళ్లు గడిచిపోయింది.. చివరి సంవత్సరం ఎన్నికలు ఉంటాయి. రేవంత్ సర్కార్ ఏమీ చేయలేదు. భూములు పంచి పెట్టి బ్యాక్ ఎండ్ ఏదో లబ్ది పొందాలని ప్లాన్ చేశారు. ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే బీఆర్ఎస్ పార్టీకి పేరు వస్తుందని ఇలా చేశారు. వాళ్ళు ఏమి చేసినా నడవదు... నిలబడదు. ఉన్నది ఉన్నట్టుగా అక్కడ ఫార్మా సిటీనే వస్తుందని అయన స్పష్టం చేసారు.

## పీఎంజీఎస్‌వై పనులకు తెలంగాణకు మరిన్ని అనుమతులు, నిధులు ఇవ్వాలి

**మంత్రి సీతక్క**



రాష్ట్రాలపై 40 శాతం భారం వేయకుండా, గతంలో మాదిరిగా 100% నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించాలి ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ, వన్యప్రాణి చట్టాల వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయి ఆదివాసీల అభివృద్ధికి అడ్డుగా ఉన్న చట్టాలను సవరించాలి దక్షిణాది రాష్ట్రాల ఞావీ+ఞ్ ప్రాంతీయ సమావేశంలో మంత్రి సీతక్క విజ్ఞప్తి సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం చూపిస్తామని వెల్లడి ప్రధాన్ మంత్రి గ్రామ సడక్ యోజన (PMGSY) కింద తెలంగాణకు మరిన్ని రహదారి పనులు మంజూరు చేయాలని, ముఖ్యంగా ఆదివాసి గిరిజన మారుమూల ప్రాంతాల్లో రహదారి అనుసంధానానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌ల దక్షిణాది రాష్ట్రాల PMGS ప్రాంతీయ సమావేశంలో మంత్రి సీతక్క పాల్గొని రాష్ట్ర సమస్యలు, అవసరాలను కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి అతిథి సింగ్, ఎన్‌ఆర్‌ఐడీఏ డైరెక్టర్ జనరల్, దక్షిణాది రాష్ట్రాల అధికారులు, జుచీజ లు, జజు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా PMGSY గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, మార్కెట్లకు రాకపోకలను మెరుగుపరిచిందన్నారు. ప్రస్తుతం ఈ పథకం మారుమూల గ్రామాలు, ఆదివాసి గిరిజన గూడెలను, మైదాన ప్రాంతాలతో అనుసంధానం చేస్తుంది అన్నారు. అయితే గతంలో ప్రధానమంత్రి గ్రామీణ యోజన పథకానికి 100% నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించేదని, కానీ కేంద్ర ప్రభుత్వం నిబంధనలు మార్చి రాష్ట్రాలపై 40 శాతం భారం వేస్తోందని, ఆ విధానాన్ని పునఃసమీక్షించాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన, భౌగోళికంగా క్లిష్టమైన ప్రాంతాల - మిగతా5లో

## కారులో.. హుషారు!

**గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నూతన కమిటీలు**

**పార్టీ పదవులకు పోటీపడుతున్న ఆశావహులు**

**ఉమ్మడి జిల్లా, నియోజకవర్గాలకు ఇన్‌చార్జుల నియామకం**

**ప్రతీ మండలంలో ఐదుగురితో సమన్వయ కమిటీ**

**బూత్ నుంచి ఇద్దరికి డిజిటల్ సభ్యత్వాలపై శిక్షణ**

**హరీశ్‌రావు పర్యవేక్షణలో 'గులాబీ' సైన్యానికి కసరత్తు**




**సిద్దిపేట:** అప్పటి టీఆర్ఎస్.. ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీకి పురిటిగడ్డగా ఉమ్మడి మెదక్ జిల్లాను భావిస్తారు. 2001లో పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు మెతుకుసీమ ఊపిరిలూదుతూనే ఉంది. తొలి ఉప ఎన్నిక మొదలు చివరి అసెంబ్లీ ఎన్నికల వరకు గులాబీ పార్టీకి ఈ ప్రాంతం వెన్నుదన్నుగా నిలిచింది. అయితే అపజయాలు, లోటుపాట్లు కూడా లేకపోలేదు. మెతుకుసీమను కంచుకోటగా చేసుకున్న బీఆర్ఎస్?కు ధీటుగా నేడు కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తయారయ్యాయి. అందుకే క్షేత్రస్థాయిలో గులాబీ సైన్యాన్ని మరింత బలోపేతం చేసేదిశగా పావులు కదుపుతున్నారు.

**బూత్ నుంచి జిల్లా దాకా**

పార్టీ సభ్యత్వాల నమోదు కోసం గ్రామాలు, పట్టణాల్లోని ప్రతీ పోలింగ్ బూత్ నుంచి ఇద్దరిని ఎంపిక చేస్తున్నారు. ఈ ఇద్దరికీ డిజిటల్ -- మిగతా5లో

# సంపాదకీయం

## ఒకప్పుడు అప్రతిహతం..
# నేడు హతం!

దేశంలో కమ్యూనిజం సిద్ధాంతాలను బలోపేతం చేసిన కమ్యూనిస్టు పార్టీలు.. తాజా ఎన్నికలతో కనుమరుగయ్యాయి. ప్రజా పాలనలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన సీపీఐ, సీపీఎం పార్టీలు.. పలు రాష్ట్రాల్లో అధికారం చలాయించాయి. అయితే.. ఒక్కొక్క దశలో ఎదురైన అనేక సంఘర్షణల కారణంగా కాలానికి అనుగుణంగా దూసుకుపోయే తత్వాన్ని అలవరుచుకోని కామ్రేడ్లు.. ప్రజా క్షేత్రంలో తమను తామే ఓడించుకుని.. అధికారానికి దూరమయ్యారు. తాజాగా కేరళలో ఎల్‌డీఎఫ్ కూటమి సైతం ఓటమి పాలవడంతో దేశంలో ఎక్కడా కమ్యూనిస్టుల ప్రభుత్వం లేకుండా పోయింది. మొత్తం 36 రాష్ట్రాల్లో ఎక్కడా కమ్యూనిజం ప్రభావం కూడా కనిపించకపోవడం గమనార్హం. 1980వ దశకంలో, సీపీఐ(ఎం) నేతృత్వంలోని వామపక్ష పార్టీలు కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లను ఏకకాలంలో పాలించాయి. లోక్‌సభలోనూ సత్తా చాటాయి. 2004లో 60కి పైగా సీట్లు గెలుచుకుని అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. భారత్-అమెరికా అణు ఒప్పందంపై లోక్‌సభలో దాదాపు 60 మంది ఎంపీలు ఉన్న వామపక్ష కూటమి మద్దతు ఉపసంహరించుకోవడంతో, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. ఇది అప్పట్లో పెను సంచలనంగా మారింది.పశ్చిమ బెంగాల్‌లో 1977 నుండి 2011 వరకు వామపక్ష కూటమి అధికారంలో ఉంది. ఈశాన్య రాష్ట్రం త్రిపురను 1993 నుండి 2018 వరకు పాలించింది. ఇక, కేరళలో ప్రతి ఐదేళ్లగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ తాజా ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. 1977లో పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ(ఎం) అధికారంలోకి వచ్చింది. తద్వారా ఏ రాష్ట్రంలోనైనా ఏ పార్టీకి దక్కని సుదీర్ఘ నిరంతర పాలనకు నాంది పలికింది. జ్యోతి బసు 23 సంవత్సరాలకు పైగా ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2000లో బుద్ధదేబ్ భట్టాచార్య సీఎం అయ్యారు. ఆ తర్వాత వామపక్షాలు మరో 11 సంవత్సరాల పాటు బెంగాల్‌ను పాలించాయి. ఈశాన్య రాష్ట్రం త్రిపురలో 1993 నుండి 2018 వరకు వామపక్షాలు అధికారం దక్కించుకున్నాయి. 1993లో రాష్ట్రంలో వామపక్షాలు ఘనవిజయం సాధించాయి. అసెంబ్లీలోని 60 స్థానాలకు గాను సీపీఐ(ఎం) ఒక్కటే 44 స్థానాలను గెలుచుకుంది. 1998 వరకు దశరథ్ దేబ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తర్వాత మాణిక్ సర్కార్ బాధ్యతలు స్వీకరించి 20 సంవత్సరాల పాటు ఆ పదవిలో కొనసాగారు. త్రిపురలో 25 ఏళ్ల వామపక్ష కూటమి పాలన 2018లో బీజేపీ అనూహ్యంగా ఓడించడంతో ముగిసింది. 2023లో బీజేపీ విజయాన్ని పునరావృతం చేసింది.కేరళలో సీపీఐ(ఎం) పేలవమైన ప్రదర్శనతో వామపక్షాల చివరి కంచుకోట కూలిపోయింది. ప్రస్తుత ఓట్ల లెక్కింపు సరళి ప్రకారం, ఈ దక్షిణ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సునాయాసమైన ఆధిక్యాన్ని సాధించింది. 2016లో అధికారంలోకి వచ్చిన పినరయి విజయన్ నేతృత్వంలోని సీపీఐ(ఎం) లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం అధికారం నుంచి దిగిపోయింది. 1977 తర్వాత తొలిసారిగా భారతదేశంలో కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రి లేక పోవడం గమనార్హం. మరో వైపు దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకుల ఉద్యమా లకు పెట్టింది పేరుగా ఈ పార్టీ ప్రాభవం దక్కించుకుంది. గత వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్ర మహోన్నతమైనది. రష్యా అక్టోబర్ విప్లవ ప్రభావంతోనే ఇండియాలో కూడా 1925లోనే రాడికల్ హ్యూమనిస్టు యంయన్.రాయ్, దత్,యస్ఏ డాంగే, తదితర కార్మిక నేతల నేతృత్వంలో "కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా" సీపీఐ కి అంకురార్పణ జరిగింది. ఆనాటి బ్రిటిష్ వలసవాదులు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో అప్పట్లో రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు ఎన్నెన్నో ఉద్యమాలు చేసారు. గ్రామీణ రైతాంగ ఉద్యమాలు మొదలు, పట్టణ పారిశ్రామిక కార్మికుల ఉద్యమాలు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు , ఉపాధ్యాయ, బ్యాంకు, రైల్వే, ఆర్టీసీ , ఎలక్ట్రిసిటీ , టెలిఫోన్, ప్రభుత్వ ఉద్యోగులైతేనేమి, బీడీ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులైతేనేమి, ఇళ్ల స్థలాల ఉద్యమాలైతే నేమి , జీతాలు, కూలీలు, బోనసులు, పని పరిస్థితుల మెరుగుదల మొదలైన వన్నీ కోట్లాది ప్రజలకు అందిన మేరకు అవన్నీ కమ్యూ నిస్టు ఉద్యమాల ఫలితాలే. లక్షలాది కమ్యూనిస్టు కార్యకర్తల , నాయకుల త్యాగాల ఫలితమే నేడు అమలులో ఉన్న ప్రావిడెంటు ఫండ్ , పెన్షన్, సెలవులు, 8 గంటల పని, తదితర సౌకర్యాలు. ఆదివాసీ గిరిజనులకు,పేదలకు కొన్నయినా భూములు దక్కాయంటే కమ్యూనిస్టులు, నక్సలైట్లు, మావోయిస్టులు, వేలాది మంది ప్రాణ త్యాగాలతో సాధించి పెట్టినవే. ఇంతటి మహత్తర ఉద్యమాల చరిత్ర వేల వేల పేజీలు వేలాది పుస్తకాలుగా డాక్యుమెంట్లుగా రికార్డయి వున్నాయి.నిజానికి కాంగ్రెస్ పార్టీ గురించి చాలా మంది చర్చిస్తారు. కానీ, కాంగ్రెస్ కంటే కూడా ముందుగానే గ్రామాల్లో పరిఢవిల్లిన పార్టీ సీపీఐ అంటే ఆశ్చర్యం వేస్తుంది. ఏ గ్రామానికి వెళ్లినా.. నాలుగు రోడ్ల కూడలిలో ఎర్ర జెండా ఎగరేసే దిమ్మెలు దర్శనమిస్తాయి.కనీసంలో కనీసం పది మంది అయినా.. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో కనిపిస్తారు. అలా ఒకప్పుడు ప్రాభవాన్ని సంతరించుకున్న పార్టీ, పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర తదితర రాష్ట్రాల్లో అధికారంలోకి కూడా వచ్చింది. నైజాం రాజరికం ఉన్న తెలంగాణ రాష్ట్రం లో భూస్వామ్య శృంఖలాలు తెంచడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైనది.ఆంధ్రమహాసభ కార్యక్రమం లో రహస్యంగా ప్రవేశించి గ్రంథాలయ ఉద్యమం,రాత్రి బడులు లాంటి చిన్న చిన్న సంస్కరణలు ద్వారా రైతాంగ ఉద్యమానికి పునాదులు వేసింది.చివరకు అది 'తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం' గా మారి ఐదు లక్షల గ్రామాలకు ఎర్రజెండా విస్తరించింది."దున్నే వానికే భూమి"కీలక నినాదం ను ముందుకు తేవడం ద్వారా దేశంలో భూసంస్కరణలు అమలు జరపడానికి కమ్యూనిస్టుల పోరాటమే మూలం.సైద్ధాంతిక గందరగోళం మధ్య సరైన పంథాలో పయనం సాగించలేకపోయిన భారత కమ్యూనిస్ట్ పార్టీ 1964లో రెండుగా చీలింది. సీపీఐ నుంచి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) సీపీఎం పార్టీ అవతరించింది. సీపీఐకి చంద్ర రాజేశ్వరరావు, నల్లమల్ల గిరి ప్రసాద్, సీపీఎంనకు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య లాంటి దిగ్గజాలు నేతృత్వం వహించారు. కమ్యూనిస్టు పంథా విషయంలో తిరిగి సీపీఎం పార్టీలో తలెత్తిన విబేధాల మూలంగా 1967లో మరో చీలికకు దారితీసి 'నక్సల్ బరీ 'గ్రామంలో తలెత్తిన తిరుగుబాటుతో (భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు, లెనినిస్ట్ పార్టీ ,సీపీఐ(ఎంఎల్)గా ఉనికిలోకి వచ్చింది.బెంగాల్ నక్సల్బరీ రైతాంగ ఉద్యమం విభేదాలలోనే చారుమజుందార్, కానూసన్యాల్, వినోద్ మిశ్రా లాంటి నేతలు నక్సలైట్ ఉద్యమానికి బాటలు వేశారు. ఆంధ్రప్రదేశ్ లో దేవులపల్లి వెంకటేశ్వరరావు,తరిమల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి,పైలా వాసుదేవరావు, కొండపల్లి సీతారామయ్య లాంటి నేతలు పనిచేశారు. కమ్యూనిస్టు ఉద్యమంలో నిజానికి1948 నుండే చీలికలు మొదలయ్యాయి. 1948లో శిబ్దాశ్ ఘోష్ విడిపోయి వేరే పార్టీని ఉద్యమాలను నిర్మించారు. అది నేటికీ బలమైన ట్రేడ్ యూనియన్ గా జాతీయ స్థాయిలో కొనసాగుతుంది. నేటికి కూడా కమ్యూనిస్టులు అనేక చీలికలు పేలికలు కావడంతో వారి ఉద్యమాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లోనే సీపీఐ ఎంఎల్ లో అనేక చీలికలు కనిపిస్తాయి. జనశక్తి, ప్రజాపంథా, ప్రతిఘటన, ప్రజాప్రతిఘటన, లిబరేషన్, న్యూడెమోక్రసీ, మావోయిస్టు పార్టీ యూసీసీఆర్ఐ ఎంఎల్ ఇలా చెప్పుకుంటూ పోతే పదుల సంఖ్యలో చీలికలుగా కమ్యూనిస్టు పార్టీ ముక్కలుచెక్కలైంది.నేడు వివిధ పార్టీలుగా , గ్రూపులుగా ఉన్నప్పటికీ వారంత కమ్యూనిస్టు వారసులే అని పేర్కొనవచ్చు. రష్యా, చైనా తదితర తమ్యూనిస్టు దేశాలు కూడా మార్కెట్ ఎకానమీలో భాగమై ముందుకు సాగుతున్నారు. అంబేద్కర్, నెహ్రూ, లోహియా , కమ్యూనిస్టులు ఎంతో ఆశలు పెట్టుకున్న నేషనలైజేషన్ స్థానంలో యూ టర్న్ తీసుకొని ప్రపంచీకరణ పేరిట ప్రయివేటీకరణ ముందుకు సాగుతున్న దశ. ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం స్థానంలో తిరిగి పన్నెండు, పద్నాలుగంటల పని విధానం చాపకింది నీరులా ముందుకు వస్తున్నది. సంఘటిత శక్తుల్లో నీరసం ఆవహించింది. వందేళ్లలో ఊహించని వారెందరో ఆర్థిక వ్యవస్థలో ఎదిగి రాజకీయాలను నిర్దేశిస్తున్నారు. కార్మిక వర్గాన్ని సమిష్టి పారిశ్రామిక వర్గంగా ఎదిగించాలనే ఆలోచన చేయకపోవడం వల్ల కమ్యూనిస్టు లకు సొంత వనరులు , సొంత లాబీలు తగ్గి పోయాయి.

## బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కోసం
# 119 నియోజకవర్గాలకు ఇన్‌చార్జిల నియామకం

### కేసీఆర్ ఆదేశం



**హైదరాబాద్, అక్షర సవాల్ :** బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు పార్టీ అధినేత కేసీఆర్ రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించారు. ఉమ్మడి పది జిల్లాల వారీగా ఇన్‌చార్జిల పేర్లను పార్టీ ప్రకటించింది.

ఆదిలాబాద్ జిల్లా: సిర్పూర్ -- పాటిమీది జగన్ మోహన్ రావు, చెన్నూర్ (ఎస్సీ) -- తిప్పని లింగన్న, బెల్లంపల్లి (ఎస్సీ) -- మిర్యాల రాజిరెడ్డి, మంచిర్యాల -- కౌశిక హరి, ఆసిఫాబాద్ (ఎస్టీ) -- తొంగల సత్యనారాయణ, ఖానాపూర్ (ఎస్టీ) -- సుమిత్ర ఆనంద్ తనోబా, ఆదిలాబాద్ -- రాథోడ్ జనార్దన్, బోథ్ (ఎస్టీ) -- ఎ. శ్రీకాంత్ రెడ్డి, నిర్మల్ -- మూల రాజిరెడ్డి, ముధోల్ -- రఘువీర్ సింగ్.

**నిజామాబాద్ జిల్లా:** ఆర్మూర్ -- కాంతారెడ్డి తిరుపతి రెడ్డి, బోధన్ -- డి. విఠల్ రావు, జుక్కల్ (ఎస్సీ) -- మాటం భిక్షపతి, బాన్సువాడ -- తోట ఆగయ్య, ఎల్లారెడ్డి -- దఫేదార్ రాజు, కామారెడ్డి -- సేరి సుభాష్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ -- రవీందర్ సింగ్, నిజామాబాద్ రూరల్ -- గిర్ధావర్ గంగాధర్, బాల్కొండ -- దావా వసంత.

**కరీంనగర్ జిల్లా:** కోరుట్ల -- లోక బాపు రెడ్డి, జగిత్యాల -- కె. విద్యాసాగర్ రావు, ధర్మపురి (ఎస్సీ) -- మూల విజయ రెడ్డి, రామగుండం -- ఎనుగు రవీందర్ రెడ్డి, మంథని -- వీర్ల వెంకటేశ్వర్ రావు, పెద్దపల్లి -- పి. వెంకట్రామిరెడ్డి, కరీంనగర్ -- కొండూరి రవీందర్ రావు, చొప్పదండి (ఎస్సీ) -- పన్యాల భూపతి రెడ్డి, వేములవాడ -- గుడూరి ప్రవీణ్, సిరిసిల్ల -- తుల ఉమ, మానకొండూర్ (ఎస్సీ) -- పెరాల రవీందర్ రావు, హుజూరాబాద్ -- డాక్టర్ చిరుమిల్ల రాకేష్, హుస్నాబాద్ -- జివి రామకృష్ణారావు.

**మెదక్ జిల్లా:** సిద్దిపేట -- వంటేరు యాదవ రెడ్డి, మెదక్ -- ఫారూక్ హుస్సేన్, నారాయణఖేడ్ -- జైపాల్ రెడ్డి, అందోల్ (ఎస్సీ) -- పట్నం మాణిక్యం, నర్సాపూర్ -- నరహరి రెడ్డి, జహీరాబాద్ (ఎస్సీ) -- దేవీ ప్రసాద్, సంగారెడ్డి -- చంద్ర గౌడ్, పటాన్‌చెరు -- ఎర్రోళ్ల శ్రీనివాస్, దుబ్బాక -- కాసాల బుచ్చిరెడ్డి, గజ్వేల్ -- రాధాకృష్ణ శర్మ.

**రంగారెడ్డి జిల్లా:** మేడ్చల్ -- రాగిడి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి -- నందికంటి శ్రీధర్, కుత్బుల్లాపూర్ -- కె. నవీన్ రావు, కూకట్‌పల్లి -- గజ్జెల నాగేశ్, ఉప్పల్ -- గొంగిడి మహేందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం -- స్వామి గౌడ్, ఎల్బీనగర్ -- నాగేశ్ ముదిరాజ్, మహేశ్వరం -- వాణీదేవి, రాజేంద్రనగర్ -- రావుల శ్రీధర్ రెడ్డి, శేరిలింగంపల్లి -- శంభిపూర్ రాజు, చేవెళ్ల (ఎస్సీ) -- రాంబాబు యాదవ్, పరిగి -- ఎంఎన్ శ్రీనివాస్, వికారాబాద్ (ఎస్సీ) -- గట్టు రాంచందర్ రావు, తాండూరు -- విప్లవ్ కుమార్.

**హైదరాబాద్ జిల్లా:** ముషీరాబాద్ -- వెంకట్ రెడ్డి, అంబర్‌పేట్ -- కోలేటి దామోదర్ గుప్తా, ఖైరతాబాద్ -- దాసోజు శ్రవణ్, జూబ్లీహిల్స్ -- విష్ణువర్ధన్ రెడ్డి, సనత్‌నగర్ -- గోసుల శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ -- ఎండీ సలీం, సికింద్రాబాద్ కంటోన్మెంట్ (ఎస్సీ) -- మన్నె క్రిశాంక్, నాంపల్లి -- షేక్ అబ్దుల్లా సోహైల్, కార్వాన్ -- ఇనాయత్ అలీ బాఖ్రీ, గోషామహల్ -- గౌండ్ల నాగేందర్ గౌడ్, చార్మినార్ -- అలీ బిన్ ఇబ్రహీం మస్కతి, చాంద్రాయణగుట్ట -- షాహీన్ అఫ్రోజ్, యాకుత్‌పురా -- అర్షద్ అలీ ఖాన్, బహదూర్‌పురా -- ఎస్.ఎ. ఖైసర్, మలక్‌పేట్ -- మహమ్మద్ ఆజమ్ అలీ.

**మహబూబ్‌నగర్ జిల్లా:** కొడంగల్ -- నవీన్ కుమార్ రెడ్డి, నారాయణపేట -- రాజీవ్ సాగర్, మహబూబ్‌నగర్ -- వాల్యా నాయక్, జడ్చర్ల -- పాల్వాయి శ్రవంతి, దేవరకద్ర -- పల్లె రవికుమార్, మక్తల్ -- దూదిమెట్ల బాలరాజు, వనపర్తి -- మహమ్మద్ ఇంతియాజ్ ఇషాక్, గద్వాల -- ఆంజనేయ గౌడ్, అలంపూర్ (ఎస్సీ) -- చల్లా వెంకట్రామిరెడ్డి, నాగర్‌కర్నూలు -- జహంగీర్, అచ్చంపేట (ఎస్సీ) -- శుభప్రద్ పటేల్ నూలి, కల్వకుర్తి -- రాజిని సాయిచంద్, షాద్‌నగర్ -- బైకాని శ్రీనివాస్ యాదవ్, కొల్లాపూర్ -- అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి.

**నల్గొండ జిల్లా:** దేవరకొండ (ఎస్టీ) -- చింతల వెంకటేశ్వర్ రెడ్డి, నాగార్జునసాగర్ -- బుడిద భిక్షమయ్య గౌడ్, మిర్యాలగూడ -- బి. లింగయ్య యాదవ్, హుజూర్‌నగర్ -- కంచర్ల కృష్ణారెడ్డి, కోదాడ -- తిప్పన విజయసింహా రెడ్డి, సూర్యాపేట -- ఈస్లావత్ రాంచందర్ నాయక్, నల్గొండ -- ఎంసీ కోటి రెడ్డి, మునుగోడు -- వెంకట నారాయణ గౌడ్, భువనగిరి -- క్యామ మల్లేష్, నకిరేకల్ (ఎస్సీ) -- గుజ్జా దీపిక యుగంధర్ రావు, తుంగతుర్తి (ఎస్సీ) -- ఏలగందుల వెంకటేశ్వర్, ఆలేరు -- బండా నరేందర్ రెడ్డి.

**ఖమ్మం జిల్లా:** పినపాక (ఎస్టీ) -- దిండిగల రాజేందర్, ఇల్లందు (ఎస్టీ) -- చాడ కిషన్ రెడ్డి, ఖమ్మం -- అనుగుల రాకేష్ రెడ్డి, పాలేరు -- తాతా మధు, మధిర (ఎస్సీ) -- నామా నాగేశ్వరావు, వైరా (ఎస్టీ) -- ఆర్‌జేసీ కృష్ణ, సత్తుపల్లి (ఎస్సీ) -- కురాకుల నాగభూషణం, కొత్తగూడెం -- వద్దిరాజు రవిచంద్ర, అశ్వారావుపేట (ఎస్టీ) -- ఉప్పల వెంకటరమణ, భద్రాచలం (ఎస్టీ) -- రావలపల్లి రామ్ ప్రసాద్.

**వరంగల్ జిల్లా:** జనగామ -- బండా శ్రీనివాస్, ఘనపూర్ (ఎస్సీ) -- నాగుర్ల వెంకన్న, పాలకుర్తి -- ఎం. సుధీర్ కుమార్, డోర్నకల్ (ఎస్టీ) -- మాలోత్ కవిత, మహబూబాబాద్ (ఎస్టీ) -- వై. సతీష్ రెడ్డి, నర్సంపేట -- ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, పరకాల -- సమ్మా రావు, వరంగల్ పశ్చిమ -- కె. వాసుదేవ రెడ్డి, వరంగల్ తూర్పు -- మత్రి యాదవ రెడ్డి, వర్ధన్నపేట (ఎస్సీ) -- మసూద్, భూపాలపల్లి -- రామస్వామి నాయక్, ములుగు (ఎస్టీ) -- గండ్ర జ్యోతి.డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి నియోజకవర్గంలో సమర్థవంతంగా నిర్వహించి, పార్టీని బలోపేతం చేయాలని ఇన్‌చార్జిలకు కేసీఆర్ సూచించారు.

# ఖాకీ కాదు.. కరుణకు ప్రతిరూపం

## ఆపదలో విలవిల్లాడుతున్న దంపతులకు అండగా నిలిచిన హసన్పర్తి సీఐ మహేందర్



**హసన్ పర్తి , మే 22: అక్షర సవాల్ :**పోలీస్ అంటే కేవలం చట్టాన్ని అమలు చేసే యంత్రాంగం మాత్రమే కాదు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే మానవత్వానికి ప్రతిరూపం అని నిరూపించిన ఘటన హసన్పర్తి మండలంలో చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రక్తమోడుతూ సహాయం కోసం ఎదురుచూస్తున్న దంపతులను చూసి క్షణం కూడా ఆలస్యం చేయకుండా స్పందించిన హసన్పర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.గురువారం గుంటూరుపల్లి గ్రామపంచాయతీలో రైతులతో సమావేశం ముగించుకుని తిరిగి హసన్పర్తి వైపు వస్తున్న సమయంలో ఓఆర్ఆర్ సమీపంలో ఈ సంఘటన జరిగింది. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లి మిర్చి కొనుగోలు చేసి, ఎక్సెల్ ద్విచక్రవాహనంపై గుంటూరుపల్లికి తిరుగు ప్రయాణమవుతున్న మడిపల్లి వెంకటస్వామి, ఆయన భార్య పద్మ దంపతులకు ఊహించని ప్రమాదం ఎదురైంది.బైక్‌పై వెళ్తున్న సమయంలో పద్మ కట్టుకున్న చీర అకస్మాత్తుగా వెనుక చక్రంలో ఇరుక్కుపోవడంతో వాహనం అదుపుతప్పి ఒక్కసారిగా రోడ్డుపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై పడి నొప్పితో విలవిల్లాడుతున్న వారిని చూసి స్థానికులు కూడా కొంతసేపు ఏం చేయాలో అర్థం కాక నిలబడిపోయారు.అదే సమయంలో అక్కడి నుంచి విధి నిర్వహణలో భాగంగా వెళ్తున్న సీఐ మహేందర్ ప్రమాదాన్ని గమనించారు. వెంటనే తన అధికారిక వాహనాన్ని ఆపి కిందికి దిగారు. గాయాలతో బాధపడుతున్న దంపతుల వద్దకు పరుగెత్తి వారి పరిస్థితిని పరిశీలించారు. రక్తం కారుతున్నా, సరైన వాహనం కోసం ఎదురుచూడకుండా క్షణాల్లో నిర్ణయం తీసుకున్నారు.గాయపడిన దంపతులను స్వయంగా తన పోలీసు వాహనంలో ఎక్కించుకుని హసన్పర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకున్న వెంటనే వైద్యులతో మాట్లాడి, గాయపడిన వారికి వెంటనే చికిత్స అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వారి బంధువులకు సమాచారం అందించే వరకు స్వయంగా అక్కడే ఉండి పర్యవేక్షించారు.సకాలంలో వైద్యం అందడంతో దంపతులిద్దరూ ప్రమాదం నుంచి కోలుకుంటున్నారు. తమను కాపాడిన సీఐ మహేందర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. "మేము రోడ్డుపై పడి ఉన్న సమయంలో సార్ రావడం, మమ్మల్ని ఆసుపత్రికి తీసుకెళ్లడం మా జన్మలో మర్చిపోలేని విషయం. పోలీస్ అంటే భయపడేవాళ్లం, కానీ సార్ మాలో మానవత్వంపై నమ్మకం పెంచారు" అని బాధితుడు వెంకటస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన స్థానికులు, గుంటూరుపల్లి గ్రామస్తులు సీఐ మహేందర్ చూపిన చొరవను ప్రశంసిస్తున్నారు. "ఖాకీ దుస్తుల్లోనూ కరుణ గుండె కొట్టుకుంటూనే ఉంది. విధి నిర్వహణలో భాగంగా వెళ్తున్నా, మనుషులుగా మన బాధ్యత మరచిపోలేదని సార్ నిరూపించారు" అని గ్రామస్తులు అభినందిస్తున్నారు.పోలీస్ శాఖపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించి, మానవత్వంతో కూడిన పోలీసింగ్‌కు మహేందర్ చేసిన ఈ సేవ ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. విధి నిర్వహణకు మించి మానవత్వాన్ని చాటిన సీఐ మహేందర్ చర్య హసన్పర్తి ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

## ఆశా వర్కర్ల జిల్లా మహాసభలను
# జయప్రదం చేయండి

### సీఐటీయూ, ఆశా యూనియన్ పిలుపు




**వరంగల్, అక్షర సవాల్ :** ఆశా వర్కర్ల డిమాండ్ల సాధన కోసం మే 29న వరంగల్ నగరంలో జిల్లా మహాసభలు భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు సీఐటీయూ, ఆశా వర్కర్స్ యూనియన్ ప్రకటించాయి. వరంగల్ జిల్లా ఉర్సుగుట్టలోని రామసురేందర్ భవన్‌లో గురువారం ఆశా వర్కర్ల జిల్లా సమావేశం జరిగింది. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చినగారి రాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, ఆశా వర్కర్లకు కనీస వేతనంగా రూ. 26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ప్రకటించిన రూ. 20,000 వేతనాన్ని ఆశా వర్కర్లకు కూడా వర్తింపజేయాలని కోరారు. అలాగే ఆశాలపై రోజురోజుకూ పెరుగుతున్న పని భారాన్ని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. మే 29, 2026న వరంగల్ నగరంలో జరిగే జిల్లా మహాసభలకు రాష్ట్రస్థాయి ముఖ్య నాయకులు హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని ఆశా వర్కర్లందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభకు ముందు అన్ని ప్రాంతాల్లో సన్నాహక సమావేశాలు జరుపుకోవాలని, కొత్త కమిటీలను ఎన్నుకోవాలని యూనియన్ అధ్యక్షురాలు రాణి కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగమణి, రజిత, రాధిక, రాణి తదితరులు పాల్గొన్నారు. చినగారి రాణి జిల్లా అధ్యక్షురాలు ఆశా వర్కర్స్ యూనియన్, వరంగల్ జిల్లా కమిటీ

# ఏడవ డివిజన్‌లో మోరీలు, డ్రైనేజీల శుభ్రత.. వీధి దీపాల ఏర్పాటు..

### మాజీ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్





**హన్మకొండ , మే 22 అక్షర సవాల్ :**ఏడవ డివిజన్‌లో పారిశుద్ధ్యం, ప్రజా సౌకర్యాల మెరుగుదలలో భాగంగా శుక్రవారం విద్యుత్ కార్మికులు, శానిటేషన్ సిబ్బంది వివిధ కాలనీలలో మోరీలు, డ్రైనేజీల క్లీనింగ్ పనులు చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో మురికి నీరు నిలవకుండా, దోమల బెడద తగ్గేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.అదేవిధంగా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మిగిలిపోయిన వీధి దీపాలను కూడా ఈరోజు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో ప్రజలు సురక్షితంగా తిరిగేందుకు వీలుగా వీధి వెలుగులు అందించడం లక్ష్యంగా ఈ పనులు చేశామని విద్యుత్ సిబ్బంది పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇలాంటి పనులు నిరంతరం కొనసాగుతాయని ఏడవ డివిజన్ మాజీ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ తెలిపారు.

# హైటెక్ సిటీ యశోదా హాస్పిటల్స్‌లో అత్యాధునిక 'రోబోటిక్ సర్జరీ',

**"ఎంఆర్ లినాక్" సాంకేతికతతో**

**చిన్న రంధ్రాల ద్వారానే క్లిష్టమైన క్యాన్సర్ శస్త్రచికిత్సలు**

**ఆరోగ్యకరమైన కణాలకు హాని లేకుండా రేడియేషన్ థెరపీ**

**క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు**

**పర్మనెంట్ కొలోస్టమీ అవసరం లేని సరికొత్త విధానం**

**హన్మకొండ ప్రెస్ మీట్‌లో యశోదా హాస్పిటల్స్ వైద్య నిపుణులు వెల్లడి**



**హనుమకొండ, మే 22 అక్షర సవాల్ :** క్యాన్సర్ చికిత్సా రంగంలో వస్తున్న సాంకేతిక ఆవిష్కరణలు రోగులకు కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయని యశోదా హాస్పిటల్స్ (హైటెక్ సిటీ) నిపుణులు వెల్లడించారు. ముఖ్యంగా రోబోటిక్ సర్జరీ, "ఎంఆర్ లినాక్" రేడియేషన్ టెక్నాలజీలు క్యాన్సర్ వైద్యంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. శుక్రవారం హన్మకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ రేడియేషన్ ఆంకాలజీ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సునీత, రోబోటిక్ సర్జన్ డాక్టర్ ఇ. రాజేష్ గౌడ్ ఈ అత్యాధునిక చికిత్సా విధానాల వివరాలను వెల్లడించారు.

**8 ఎంఎం చిన్న రంధ్రాలతోనే రోబోటిక్ సర్జరీ**

గతంలో లాగా పెద్ద కోతలు లేకుండా, కేవలం 8 ఎంఎం చిన్న రంధ్రాల ద్వారా హై-డెఫినిషన్ 3డి విజన్, మనిషి చేతి కదలికలను అనుకరించే ట్విస్టెడ్ ఇన్‌స్ట్రుమెంట్స్ సాయంతో క్లిష్టమైన ఆపరేషన్లను అత్యంత ఖచ్చితత్వంతో చేయవచ్చని డాక్టర్ రాజేష్ గౌడ్ తెలిపారు. మహిళల క్యాన్సర్లు : గర్భాశయ, అండాశయ క్యాన్సర్లలో 'రాడికల్ హిస్టరెక్టమీ' వంటి సర్జరీలను సురక్షితంగా చేయవచ్చును. దీనివల్ల గతంలో 4--5 రోజులు ఉండాల్సిన హాస్పిటల్ స్టే, ఇప్పుడు ఖచ్చితంగా 24 గంటలకే పరిమితమైంది. యూరాలజీ, కిడ్నీ క్యాన్సర్లు : ప్రోస్టేట్, బ్లాడర్ క్యాన్సర్లలో నరాలు దెబ్బతినకుండా కాపాడటం ద్వారా రోగి జీవన నాణ్యత మెరుగవుతుంది. కిడ్నీ క్యాన్సర్లలో పూర్తి కిడ్నీ తీసేయకుండా కేవలం ట్యూమర్‌ను మాత్రమే తొలగించే (పార్టీల నేఫ్రెక్టోమి) సదుపాయం లభిస్తుంది. మంచి ప్రయోజనాలతో పాటు తక్కువ నొప్పి, తక్కువ రక్తనష్టం, చిన్న మచ్చలు ఏర్పడటంతో పాటు రోగులు అత్యంత వేగంగా కోలుకుని తమ పనుల్లో చేరిపోవచ్చును.

**కోలోరెక్టల్ క్యాన్సర్ చికిత్సలో స్మార్ట్ సాంకేతికత**

కోలోరెక్టల్ (పెద్దపేగు) క్యాన్సర్లలో కూడా ఈ టెక్నాలజీ పెద్ద మార్పు తీసుకొచ్చిందని వైద్యులు తెలిపారు. ట్యూమర్‌ను ఖచ్చితంగా గుర్తించి తొలగించడం వల్ల చాలాసార్లు రోగులకు పర్మనెంట్ కొలోస్టమీ (కృత్రిమ మలద్వారం) అవసరం లేకుండా చేయగలుగుతున్నామని వివరించారు. ఇందులో వాడే 'స్మార్ట్ స్టాప్లర్' టెక్నాలజీ ద్వారా పేగు చివరలను (బౌల్ ఎండ్స్) మరింత సురక్షితంగా కలపవచ్చని, దీనివల్ల లీకేజ్ ప్రమాదం తప్పుతుందని పేర్కొన్నారు. అలాగే మెరుగైన నాడుల రక్షణ (చీవతీజవ జూతీవంవతీఙ్ఖఅశీఅ) వలన యూరినరీ, సెక్సువల్ క్వాలిటీ ఆఫ్ లైఫ్ కూడా బాగుంటుందని వెల్లడించారు.

**రేడియేషన్ రంగంలో సరికొత్త యుగం : "ఎంఆర్ లినాక్"**

వైద్య నిపుణులు డాక్టర్ ఎం. సునీత మాట్లాడుతూ.. రేడియేషన్ అనగానే రోగుల్లో ఉండే సైడ్ ఎఫెక్ట్స్ భయాలను దూరం చేసేందుకు దేశంలోనే తొలిసారిగా యశోదా హాస్పిటల్స్ హైటెక్ సిటీలో "ఎంఆర్ లినాక్"" టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ప్రత్యేకతతో ఒకే మిషన్‌లో ఎమ్మారై స్కాన్, లీనియర్ యాక్సిలేటర్ (ూఱఅఖుఎ) కలిసి పనిచేస్తాయి. ప్రతిరోజు రేడియేషన్ ఇచ్చే ముందు రోగికి ఆటోమేటిక్‌గా ఎమ్మారై స్కాన్ జరిగి, ట్యూమర్ సైజు, స్థానాన్ని బట్టి మిల్లీమీటర్ స్థాయిలో ఖచ్చితత్వంతో రేడియేషన్ ఇస్తారు. సైడ్ ఎఫెక్ట్స్ లేవు, పక్కన ఉండే ఆరోగ్యకరమైన అవయవాలకు ఎలాంటి హాని జరగదు. సాధారణ రేడియేషన్‌లో వచ్చే వాంతులు, అలసట, చర్మ సమస్యలు ఇందులో ఉండవు. తక్కువ కాలంలో చికిత్స: ప్రోస్టేట్, బ్రెయిన్, లంగ్, ప్యాంక్రియాస్ వంటి కష్టమైన క్యాన్సర్లకు కొన్ని సందర్భాల్లో కేవలం 5 రోజుల్లోనే చికిత్స పూర్తవుతుంది. ఈ అత్యాధునిక సాంకేతికతలు క్యాన్సర్ రోగులకు ఆర్థిక, శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించి మెరుగైన ఫలితాలను ఇస్తున్నాయని వైద్యులు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో యశోదా హాస్పిటల్స్ హైటెక్ సిటీ టీమ్ లీడర్ సాయి వెంకట, డిప్యూటీ మేనేజర్ విజయ్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# స్టేటస్ కో భూమిపై గూండాల హల్‌చల్..!

**గేట్లు పగులగొట్టి బలవంతపు ప్రవేశం**

**"అడ్డొస్తే చంపేస్తాం" అంటూ బెదిరింపులు**



**గీసుగొండ, మే 22 అక్షర సవాల్:** వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలో కోట్ల విలువైన భూమి వివాదం సంచలనంగా మారింది. కోర్టు స్టేటస్ కో ఆదేశాలు అమల్లో ఉండగానే భూమిని అక్రమ లావాదేవీలతో చేతులు మారుస్తూ, చివరకు గూండా తరహాలో దాడికి దిగిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. కొత్తవాడకు చెందిన కొండ వెంకటేశ్వర్లు తన బావ బేతి శ్రీనివాస్ రావుతో కలిసి రెడ్డిపాలెం శివారులోని సర్వే నెంబర్ 204లో భూమిని 1991, 1995 సంవత్సరాల్లో రిజిస్ట్రేషన్ పత్రాల ద్వారా కొనుగోలు చేసి అప్పటి నుంచి స్వాధీనంలో ఉంచుకున్నట్లు తెలిపారు. అయితే భూమిపై ఉన్న సివిల్ వివాదాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు కుట్రపూర్వకంగా జిపిఏల వ్యవహారం నడిపినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. "సమస్య పరిష్కారం అవుతుంది" అంటూ నమ్మబలికి సేల్-కం-జిపిఏ చేయించుకుని, అనంతరం పలువురి పేర్లపై వరుసగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు బాధితుడు ఆరోపించాడు. కోర్టు స్టేటస్ కో ఆదేశాలు ఉన్నప్పటికీ భూమి లావాదేవీలు కొనసాగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే వివాదం తాజాగా హింసాత్మక మలుపు తిరిగింది. ఈ నెల 19న సాయంత్రం కొందరు వ్యక్తులు భూమి వద్దకు చేరుకుని గేట్ తాళాలు పగులగొట్టి బలవంతంగా లోపలికి ప్రవేశించినట్లు సమాచారం. "ఈ భూమి మాదే.. మళ్లీ వస్తే ప్రాణాలతో వెళ్లరు" అంటూ బెదిరింపులకు దిగడమే కాకుండా దాడికి కూడా పాల్పడినట్లు బాధితుడు ఆరోపించాడు. ఈ ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కోట్ల విలువైన భూములపై నకిలీ డాక్యుమెంట్లు, జిపిఏల ముసుగులో జరుగుతున్న అక్రమాలపై మరోసారి చర్చ మొదలైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

# "నల్లబెల్లిలో సిపిఐ రాజకీయ శిక్షణ శిబిరాలు"

**జూన్ 3,4,5 తేదీల్లో జిల్లా స్థాయి తరగతులు**

**200 మంది కేడర్ పాల్గొననున్నట్టు ప్రకటన**



**నల్లబెల్లి, మే 22 అక్షర సవాల్:** జూన్ 3, 4, 5 తేదీల్లో నల్లబెల్లి మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో సిపిఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి తెలిపారు. మండల కేంద్రంలో పరికి కొర్నేలు అధ్యక్షతన జరిగిన సిపిఐ మండల కమిటీ సమావేశంలో మండల కార్యదర్శి బట్టు సాంబయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడ్డాయని ఆయన విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, రైతులు, కార్మికులు, చిన్న మధ్యతరహా వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల కారణంగా అప్పులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని ఆరోపించారు. వ్యవసాయ రంగం గిట్టుబాటు ధరలు లేక, కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులతో కుదేలైందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన ఉద్యమంలో 750 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. బీసీలకు వాటా ప్రకారం రిజర్వేషన్లు కల్పించకుండా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. నిరుద్యోగం పెరగడంతో యువతలో నిరాశ, ఆత్మహత్యలు, నేరాలు పెరుగుతున్నాయని, మహిళలపై దాడులు అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు దిగజారుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలతో దేశ స్వావలంబనను ప్రమాదంలోకి నెడుతోందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై ఉద్యమాలను బలోపేతం చేసేందుకు ఈ రాజకీయ శిక్షణ తరగతులు దోహదపడతాయని చెప్పారు. ఈ శిబిరాలకు సుమారు 200 మంది జిల్లా స్థాయి కేడర్ నాయకులు హాజరవుతారని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శిక్షణ శిబిరాలను ప్రారంభించనున్నారని వెల్లడించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా తదితరులు పాల్గొననున్నారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మామిండ్ల పెద్ద ఐలయ్య, కందిక రమేష్, కడియాల క్రాంతికుమార్, మర్రి రమేష్, ఓదెల రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

# "ఆదివాసి అస్తిత్వ రక్షణకు పోరాటమే మార్గం"

**జూన్ 3న కొత్తగూడలో 'ఆదివాసి పోరుకేక' బహిరంగ సభకు తుడుందెబ్బ పిలుపు**



**గీసుకొండ, మే 22 అక్షర సవాల్:** ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో జూన్ 3న మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో నిర్వహించనున్న "ఆదివాసి పోరుకేక" బహిరంగ సభ పోస్టర్‌ను శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం తుడుందెబ్బ జాతీయ కార్యదర్శి సోయం రాజేందర్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు సోయం నాగరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఆదివాసి తోటి సేవా సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆదివాసి తోటి తెగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడప రఘు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కొడప రఘు మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాల ఆదివాసి సమాజానికి చెందిన పురుషులు, మహిళలు, యువత, విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై "ఆదివాసి పోరుకేక" సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. 1976 ఎమర్జెన్సీ కాలంలో రాజ్యాంగ నిబంధనలను పక్కనబెట్టి లంబాడీలను అక్రమంగా ఎస్టీ జాబితాలో చేర్చారని ఆరోపించారు. అసెంబ్లీ తీర్మానం, గవర్నర్ ఆమోదం, పార్లమెంట్‌లో ఆర్టికల్ 342 సవరణ లేకుండానే జి.ఓ. 149 ద్వారా ఎస్టీ జాబితాలో చేర్చడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. లంబాడీలు వివిధ రాష్ట్రాల్లో బీసీ, ఓసీ కేటగిరీల్లో ఉన్నప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే ఎస్టీ హోదా పొందుతున్నారని అన్నారు. ఆదివాసుల విద్య, ఉద్యోగ అవకాశాలను లంబాడీలు ఆక్రమిస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఐఐటీ, నీట్, నెట్, సెట్ వంటి ఉన్నత విద్యావకాశాల నుంచి గ్రూప్-1 నుంచి ఐఏఎస్ స్థాయి ఉద్యోగాల వరకు ఆదివాసుల హక్కులు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. అలాగే ఆదివాసి ప్రాంతాల్లో భారీ ప్రాజెక్టులు నిర్మిస్తున్నప్పటికీ గిరిజన గ్రామాలకు సాగునీరు, తాగునీరు అందడం లేదని మండిపడ్డారు. దేవాదుల, తుపాకులగూడెం, కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టుల ద్వారా మైదాన ప్రాంతాలకు లక్షల ఎకరాలకు నీరు అందుతున్నా ఆదివాసి రైతులకు ఒక్క ఎకరానికి కూడా నీరు అందడం లేదని విమర్శించారు. గోదావరి నది పక్కనే ఉన్నా గిరిజనులు బురదనీరు తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఆదివాసీల అస్తిత్వాన్ని కాపాడుకోవాలంటే పోరాటమే శరణ్యం.. రా కదలిరా.. చలో కొత్తగూడ" అంటూ కొమురం భీం స్ఫూర్తితో సాగుతున్న తుడుందెబ్బ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు సోయం జగదీశ్వర్, గేడెం కృష్ణ, గేడెం కార్తీక్, సోయం రవి తదితరులు పాల్గొన్నారు.

# నెక్కొండలో రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యకు త్వరలో పరిష్కారం







**నెక్కొండ, మే 22 అక్షర సవాల్:** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం నెక్కొండ మండల కేంద్రంలో రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యకు త్వరలో పరిష్కారం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రజలు,వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నేపథ్యంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నెక్కొండ పట్టణంలోని నెహ్రూ సెంటర్ నుంచి అండర్ బ్రిడ్జి వరకు, అలాగే రైల్వే ట్రాక్ 1 నుంచి మూడో లైన్ వరకు ఉన్న ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే,అండర్ బ్రిడ్జి వద్ద సైడ్ గోడలు ఎత్తుగా ఉండటంతో రోడ్డు వెడల్పు తగ్గి రాకపోకలకు ఆటంకం కలుగుతోందని ప్రజలు వ్యక్తం చేసిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంజిరెడ్డి,ఆర్ అండ్ బీ ఈఈ రాజేందర్‌లతో కలిసి సైడ్ గోడలను తొలగించి రోడ్డు విస్తరణ చేపట్టాలని ఆదేశించారు. దీనిపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా నెక్కొండ రైల్వే స్టేషన్‌లో ఉన్న పలు సమస్యలను కూడా అధికారులకు వివరించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పరిష్కారం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి,తహసీల్దార్ వేముల రాజ్‌కుమార్,పంచాయతీ కార్యదర్శి సదానందం,టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్,జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు,మండల అధ్యక్షుడు లౌడియా తిరుమల్,ఉపసర్పంచ్ సింగం శ్రావణి,పట్టణ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాస్,నాయకులు చల్ల శ్రీపాల్ రెడ్డి,అడ్వకేట్ బండి శివకుమార్,వివిధ గ్రామాల సర్పంచులు,వ్యాపారస్తులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## "సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు నమ్మొద్దు"

**కోటగండి మైసమ్మ టెంపుల్ రోడ్ ఘటనపై గీసుగొండ పోలీసుల స్పష్టీకరణ**



**గీసుగొండ, మే 22 అక్షర సవాల్:** "కోటగండి మైసమ్మ టెంపుల్ -- పోతురాజుపల్లి రోడ్‌లో బీహార్ వ్యక్తులు దాడులు చేస్తున్నారు" అంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిర్ధారణ లేనిదని గీసుగొండ పోలీసులు స్పష్టం చేశారు. ప్రస్తుతం అలాంటి ఘటనపై అధికారికంగా ఎలాంటి సమాచారం తమ దృష్టికి రాలేదని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మి భయాందోళనలకు గురికావద్దని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనించిన వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సోషల్ మీడియాలో నిర్ధారణ లేని వార్తలు, పోస్టులు పంపించడం వల్ల ప్రజల్లో అనవసర భయం, అపోహలు వ్యాపించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు, యువత మరియు సోషల్ మీడియా వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తుల భద్రత కోసం గీసుగొండ పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నట్లు సి.ఐ తెలిపారు.

# ఏడవ డివిజన్‌లో మోరీలు, డ్రైనేజీల శుభ్రత..

**వీధి దీపాల ఏర్పాటు..**

**మాజీ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్**

**హన్మకొండ , మే 22 అక్షర సవాల్ :** ఏడవ డివిజన్‌లో పారిశుద్ధ్యం, ప్రజా సౌకర్యాల మెరుగుదలలో భాగంగా శుక్రవారం విద్యుత్ కార్మికులు, శానిటేషన్ సిబ్బంది వివిధ కాలనీలలో మోరీలు, డ్రైనేజీల క్లీనింగ్ పనులు చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో మురికి నీరు నిలవకుండా, దోమల బెడద తగ్గేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మిగిలిపోయిన వీధి దీపాలను కూడా ఈరోజు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో ప్రజలు సురక్షితంగా తిరిగేందుకు వీలుగా వీధి వెలుగులు అందించడం లక్ష్యంగా ఈ పనులు చేశామని విద్యుత్ సిబ్బంది పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇలాంటి పనులు నిరంతరం కొనసాగుతాయని ఏడవ డివిజన్ మాజీ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ తెలిపారు.

# వరంగల్ నగర రూపురేఖలు మారనున్నాయి...

**అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ. 4,674 కోట్ల మంజూరుపై బిజెపి హర్షం**



**వరంగల్, అక్షర సవాల్ :** వరంగల్ నగర రూపురేఖలను మార్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద వరంగల్‌కు భారీ నిధులను మంజూరు చేయడం దీనికి నిదర్శనమని బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఆధునికీకరణ ప్రాజెక్టుకు రూ. 4,674.6 కోట్లు మంజూరు చేస్తూ నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం తెలిపిందని ఆయన తెలిపారు. వరంగల్ త్రినగరాల ప్రజల దశాబ్దాల కల అయిన భూగర్భ డ్రైనేజీ సమస్యకు ఈ నిధులతో శాశ్వత పరిష్కారం లభించబోతోందన్నారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ, తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈ భారీ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కింద కేంద్ర ప్రభుత్వం రూ. 1,168.65 కోట్ల గ్రాంటును నేరుగా సమకూర్చడమే కాకుండా, జర్మన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా రూ. 2,337.30 కోట్ల రుణ సదుపాయాన్ని కూడా ఖరారు చేసిందన్నారు. ఇది వరంగల్ ప్రజలపై ప్రధాని మోదీకి ఉన్న ప్రత్యేక ప్రేమాభిమానాలకు నిదర్శనమని అన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద తెలంగాణకు మొత్తం రూ. 5,681 కోట్ల విలువైన మూడు మెగా ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేసింది. ఇందులో రూ. 4,674 కోట్లతో వరంగల్ మురుగునీటి వ్యవస్థ ఆధునికీకరణ, రూ. 840 కోట్లతో కరీంనగర్‌లో మోడల్ రోడ్లు, మౌలిక సదుపాయాలు, రూ. 166 కోట్లతో ఖమ్మం-వరంగల్-కరీంనగర్ కారిడార్ ప్రాజెక్టులు ఉన్నాయని రవికుమార్ వివరించారు. గతంలో స్మార్ట్ సిటీ మిషన్ ద్వారా వరంగల్ అభివృద్ధికి వందలాది కోట్లు అందించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఆయన గుర్తు చేశారు. వరంగల్ నగర భవిష్యత్తుకు వెన్నెముకగా నిలిచే ఈ ప్రాజెక్టుకు అండగా నిలిచిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి వరంగల్ నగర ప్రజల తరఫున బిజెపి శ్రేణులు ధన్యవాదాలు తెలుపుతున్నాయని గంట రవికుమార్ అన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు.. శాస్త్రీయ సాగుతో అధిక దిగుబడులే లక్ష్యం

**ముచ్చింపుల గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు**

**సేంద్రియ సాగు, నీటి ఆదా, సమతుల్య ఎరువులపై నిపుణుల సూచనలు**



**నల్లబెల్లి, మే 22 అక్షర సవాల్:** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు శాస్త్రీయ పద్ధతులే మార్గమని వ్యవసాయ నిపుణులు పేర్కొన్నారు. నల్లబెల్లి మండలంలోని ముచ్చింపుల గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం రైతుల్లో విశేష చైతన్యం నింపింది. కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ శాస్త్రవేత్త డా. బి. దిలీప్ కుమార్, మండల వ్యవసాయ అధికారి బి. రజిత రైతులకు ఆధునిక సాగు విధానాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా యూరియా వినియోగాన్ని తగ్గించడం, నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, అవసరానికి మించి రసాయనాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై వివరించారు. పర్యావరణ పరిరక్షణలో రైతుల పాత్ర కీలకమని స్పష్టం చేశారు. పంటల మార్పిడి విధానం, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి పొదుపు పద్ధతులు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల ఎంపిక వంటి అంశాలపై రైతులకు సవివరంగా సూచనలు అందించారు. శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని, చీడపీడలను సమగ్ర నివారణ పద్ధతుల ద్వారా అదుపు చేయాలని సూచించారు. రైతులు అడిగిన పలు సందేహాలకు నిపుణులు సమాధానాలు ఇచ్చి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ముచ్చింపుల గ్రామ సర్పంచ్ ఇస్తారీ శేఖర్, ముచ్చింపులతండా సర్పంచ్ మచ్చిక రవీందర్, దస్తగిరిపల్లి సర్పంచ్ పులి రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారి ఏ. శివకుమార్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## "ఇందిరమ్మ ఇంటి కల సాకారం.. రుద్రగూడెంలో నూతన గృహ ప్రారంభం"

**మాలోత్ చరణ్ సింగ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం.. కాంగ్రెస్ నాయకుల పాల్గొనడం**



**నల్లబెల్లి, మే 22 అక్షర సవాల్:** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో రుద్రగూడెం గ్రామానికి చెందిన ఎలుకపెల్లి సరోజన నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలోత్ చరణ్ సింగ్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రుద్రగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజ్మీర తిరుపతి నాయక్, క్లస్టర్ ఇంచార్జ్ మామిండ్ల రాజిరెడ్డి పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కర్ణాకర్, అంబారగొండా రాజు, కొమురయ్య, గాదె మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గద్దల సురేష్, మాజీ ఉపసర్పంచ్ బైకని శివకోటి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లకిడే శివాజీ, ఎలుకపెల్లి చింటురాజు, యూత్ నాయకులు వక్కల బాలరాజు, అజ్మీర రాజేందర్, వక్కల శివకుమార్, గంగారపు అశోక్, పలకల ఈశ్వర్ రెడ్డి, గద్దల సుభాష్, మంద రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# "కనీస వేతనాల పెంపులో పారదర్శకత లేదు"

**పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు లేవు**

**స్కీమ్ వర్కర్ల భవితవ్యంపై స్పష్టత ఇవ్వాలి**

**సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన వేతనాల పెంపుపై మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ తీవ్ర విమర్శలు**



**వరంగల్, మే 22 అక్షర సవాల్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కార్మికుల కనీస వేతనాల పెంపు శాస్త్రీయంగా లేదని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలను నిర్ణయించలేదని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ తీవ్ర విమర్శలు చేశారు. కార్మిక సంఘాల డిమాండ్లు, కనీస వేతనాల సలహా మండలి సూచనలను పట్టించుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుందని ఆరోపించారు. కనీస వేతనాల పెంపు కోసం క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచేలా శాస్త్రీయ విధానంలో నిర్ణయాలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినప్పటికీ, ఆచరణలో మాత్రం చిత్తశుద్ధి కనిపించలేదన్నారు. పెరిగిన వేతనాల్లో కరువు భత్యం (డీఏ) అంశాన్ని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రకటించిన కొత్త వేతనాల ప్రకారం అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.16,000, సెమీ స్కిల్డ్ వారికి రూ.17,000, స్కిల్డ్ కార్మికులకు రూ.18,500, హై స్కిల్డ్ కార్మికులకు రూ.20,000గా నిర్ణయించిందని తెలిపారు. అయితే అన్‌స్కిల్డ్ కార్మికులను తప్ప మిగతా వర్గాల వారికి ఇప్పటికే అందుతున్న వేతనాలతో పోలిస్తే పెద్దగా పెరుగుదల లేదన్నారు. కాంట్రాక్ట్ లేబర్ జీవో-11 ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో కార్మికులు రూ.13,098 నుంచి రూ.23,683 వరకు వేతనాలు పొందుతున్నారని, జీవో-4 ప్రకారం స్కిల్డ్ కార్మికుడికి రూ.19,572 ఉండగా ఇప్పుడు ప్రభుత్వం ప్రకటించిన వేతనం రూ.18,500 మాత్రమేనని, అంటే గతంతో పోలిస్తే రూ.1,072 తగ్గిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కనీస వేతనాల సలహా మండలి అన్‌స్కిల్డ్ కార్మికుడికి రూ.18,009 కనీస వేతనం, ప్రతి పాయింట్‌కు రూ.12 కరువు భత్యం సిఫార్సు చేసిందని గుర్తు చేశారు. 2021 జూన్ 25న అప్పటి ప్రభుత్వం ఐదు జీవోలు జారీ చేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం వాటికి గెజిట్ విడుదల చేయలేదని ఆరోపించారు. మున్సిపల్ కార్మికులకు గత కేసీఆర్ ప్రభుత్వం రూ.14,600 నుంచి రూ.22,000 వరకు వేతనాలు పెంచిందని, ఇప్పుడు ప్రకటించిన వేతనాల పెంపులో ఎలాంటి ప్రమాణికత కనిపించడం లేదన్నారు. కనీస వేతనాల సలహా మండలి సిఫార్సులను పక్కనబెట్టి మంత్రివర్గ ఉపసంఘం పేరిట వేతనాలు ప్రకటించడం సరైంది కాదని ప్రశ్నించారు. 1948 కనీస వేతనాల చట్టం ప్రకారం, పెరిగిన ధరలు, డాక్టర్ అక్రాయి ఫార్ములా ఆధారంగా లెక్కిస్తే నెలకు కనీసం రూ.32,000 వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు సూచిస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు కనీసం రూ.26,000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో రూ.24,000 కనీస వేతనం ఇస్తామని ప్రకటించిన సీఎం ఇప్పుడు మాట మార్చారని విమర్శించారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఆశా, ఎన్ఆర్ఈజీఎస్, ఎన్ఆర్‌హెచ్ఎం, సర్వ శిక్ష అభియాన్ వంటి పథకాల కింద మూడు లక్షల మందికి పైగా స్కీమ్ వర్కర్లు పనిచేస్తున్నారని, వీరిని ఏ కేటగిరీలోకి తీసుకొస్తారనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వేతనాల కంటే తక్కువగా కనిపిస్తున్న ఈ వేతన సవరణను ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరారు.

## "99 రోజుల ప్రజాపాలన ప్రగతి.. వరంగల్‌లో ప్రభుత్వ కార్యాచరణకు వేగం"

**ప్రజల ముంగిట సంక్షేమం.. ప్రతి కుటుంబానికి బీమా లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం**





**వరంగల్, మే 22 అక్షర సవాల్:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు నేరుగా చేరేలా యంత్రాంగం సమన్వయంతో ముందుకు సాగుతోందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. వరంగల్ హంటర్ రోడ్‌లోని శ్రీ కన్వెన్షన్ లో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం చేపట్టిన "99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" జిల్లాలో విజయవంతంగా అమలవుతోందన్నారు. మహిళల ఆర్థిక సాధికారత, విద్యా రంగ బలోపేతం, సామాజిక భద్రత లక్ష్యంగా పలు కీలక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించే వినూత్న పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురానుందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఈ విద్యా సంవత్సరం నుంచే అల్పాహారం పథకం ప్రారంభించనున్నట్లు చెప్పారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, కళ్యాణలక్ష్మి, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరుతున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో భాగంగా మెగా జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. అలాగే నాబార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఎం సువిధా -- నాబార్డ్" శిక్షణ పూర్తి చేసిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌కు సంబంధించిన సావనీర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## ఉర్సు ఎల్లమ్మ తాళ్ల మండువా భూముల విషయంలో ప్రజల్లో భయాందోళన

**సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్..**

**ఉర్సు కరీమాబాద్ గౌడ సంఘం అధ్యక్షులు బత్తిని అఖిల్ గౌడ్**







**వరంగల్, మే 22 అక్షర సవాల్ :** ఉర్సు ఎల్లమ్మ తాళ్ల మండువా ప్రాంతంలోని భూములన్నీ వక్ఫ్ బోర్డుకు చెందినవని జరుగుతున్న ప్రచారం వల్ల లక్షలు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేసిన, ఇళ్లు నిర్మించుకున్న ప్రజల్లో భయాందోళన నెలకొందని ఉర్సు, కరీమాబాద్ గౌడ సంఘం అధ్యక్షుడు బత్తిని అఖిల్ గౌడ్ తెలిపారు. పోలీసు కేసులు నమోదు చేస్తారని, నిర్మాణాలు ఆపాలని హెచ్చరికలు రావడంతో పేద, మధ్య తరగతి ప్రజలు గత వారం, పది రోజులుగా నిద్రపోవడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉర్సు శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో జరిగిన సమావేశంలో అఖిల్ గౌడ్ మాట్లాడుతూ, 1954 నుంచి నేటి వరకు ఈ భూములు ప్రైవేటు పట్టాదారుల పేరిట ఉన్నాయని స్పష్టం చేశారు. ఓఎస్ నెం. 85/2003 కేసులో "డిస్మిస్డ్ ఫర్ డిఫాల్ట్" మాత్రమే జరిగిందని, ఎక్కడా ఈ భూములను వక్ఫ్ బోర్డు భూమిగా ప్రకటించలేదని చెప్పారు అసలు దర్గా స్థలం కేవలం 600 గజాలు మాత్రమేనని, దీనికి సంబంధించిన దస్తావేజులను ఖిలావరంగల్ తహసీల్దార్ కు సమర్పించామన్నారు. సుమారు 150 ఏళ్లుగా తమ పూర్వికులు ఇక్కడ తాటి చెట్లు గీసి, కల్లు అమ్మకం చేసి జీవనోపాధి పొందారని, ముస్లిం కుటుంబాలతో రెండు, మూడు దఫాలుగా రాజీ కుదుర్చుకుని గౌడ కులం, పట్టాదారుల నుంచి వారికి డబ్బులు చెల్లించామని వివరించారు. వరంగల్ జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖాధికారులు సమగ్ర విచారణ జరిపించి, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న వివరాల ప్రకారం నిజమైన పట్టాదారులకు పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. సుమారు 150-200 కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గౌడ కులం పెద్దలు నాగపూరి అశోక్, మదూరి సుధాకర్, నాగపూరి రాజు, కుమార స్వామి, బుజ్జి బాబు, బత్తిని సతీష్, పెద్ద నర్సయ్య, శ్యామ్, రమేష్, గొడిశాల సత్తిబాబు, పల్లె రవి, గట్టు రమేష్, ప్రవీణ్, బొమ్మగాని కుమారస్వామి, పోశాల మల్లేశం, కాలనీ పెద్దలు పూజారి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## "సరస్వతి పుష్కరాలు తెలంగాణ గర్వకారణం"


**కాళేశ్వరం త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు చేసిన కాంగ్రెస్ నాయకురాలు మడే పూర్ణిమ**



**కాళేశ్వరం, మే 22 అక్షర సవాల్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాల్లో భాగంగా ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మడే పూర్ణిమ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రాన్ని సందర్శించి పుష్కర స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమంగా విరాజిల్లుతున్న కాళేశ్వరం దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన క్షేత్రమని పేర్కొన్నారు. సరస్వతీ దేవి కటాక్షం లభించే ఈ పుణ్యకాలంలో లక్షలాది మంది భక్తులు భక్తి పారవశ్యంతో పుష్కర స్నానాలు ఆచరిస్తుండటం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. సుమారు 30 లక్షల మంది భక్తుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఘనమైన ఏర్పాట్లు చేయడం అభినందనీయమని తెలిపారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల దూర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పుష్కరాలకు తరలివస్తున్నారని చెప్పారు. భారతదేశంలో సరస్వతి పుష్కరాలు నిర్వహించబడుతున్న ప్రాధాన్య క్షేత్రంగా కాళేశ్వరం నిలవడం తెలంగాణ ప్రజలకు గర్వకారణమని మడే పూర్ణిమ పేర్కొన్నారు. అలాగే జ్ఞాన సరస్వతి ఆలయం తెలంగాణలో ఉండడం, కాళేశ్వరం త్రివేణి సంగమంలో సరస్వతి నది ప్రవహించడం రాష్ట్ర ఆధ్యాత్మిక వైభవానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సరస్వతి పుష్కరాలను ఘనంగా నిర్వహించడం పట్ల తెలంగాణ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తూ, మంత్రి సీతక్క సేవలను కూడా ఆమె అభినందించారు. భక్తులంతా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా పుష్కరాలను ఆచరిస్తుండటం ఎంతో సంతృప్తిని కలిగిస్తోందని పేర్కొన్నారు.

# అల్లాడుతున్న ఉత్తర తెలంగాణ

**అదిలాబాద్, మే 22:**తెలంగాణ రాష్ట్రంలో భానుడు భగభగలాడుతున్నాడు. గత కొన్ని రోజులుగా పెరుగుతున్న ఎండల తీవ్రత ప్రస్తుతం పతాక స్థాయికి చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 డిగ్రీల వరకు అధికంగా నమోదు అవుతుండటంతో జనం ఇబ్బంది పడుతున్నారు. పరిస్థితి తీవ్రతను గమనించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేస్తూ హెచ్చరికలు చేసింది. రాష్ట్రంలో మంగళవారం నాటి వాతావరణ గణాంకాలు భయం గొల్పుతున్నాయి. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల ఐలాపూర్‌లో 45.9 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎండల తీవ్రత చాలా ముందుగానే పెరిగింది. 2025 మే 19న రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత 41.9 డిగ్రీలు ఉండగా, ఈ ఏడాది అదే సమయానికి 45.9 డిగ్రీలకు చేరుకోవడం వాతావరణ మార్పుల తీవ్రతకు అద్దం పడుతోంది. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల వంటి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాలుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు మార్కును దాటేశాయి. హైదరాబాద్‌లో వేడి తీవ్రం 43 డిగ్రీలుగా నమోదు అయ్యింది. తీవ్రమైన ఎండల కారణంగా రాష్ట్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మంగళవారం వడ దెబ్బకు గురైన నలుగురు వ్యక్తులు మరణించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరుకు చెందిన రాచర్ల రాజు అనే రైతు మరణించాడు. వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం అంతారానికి చెందిన శామ్యూల్ అనే కార్మికుడు, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం మత్తడిగూడకు చెందిన లచ్చు అనే వృద్ధురాలు, శాంతినగర్‌కు చెందిన బిరుదుల కిరణ్ కుమార్ వడదెబ్బకు ప్రాణాలు వదిలేశారు. గాలిలో తేమ శాతం గణనీయంగా పడిపోవడం ఈ తీవ్రమైన వేడికి ప్రధాన కారణంగా వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా గాలిలో తేమ 50 శాతం లోపు మాత్రమే ఉంటోంది. సాధారణంగా రాత్రివేళల్లో వచ్చే చల్లని గాలులు కూడా ఇప్పుడు వీయకపోవడం వల్ల రాత్రిపూట కూడా ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరాల్లో కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వేడి ప్రభావం మరింత ఎక్కువగా ఉంటోంది. రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు 46 నుంచి 47 డిగ్రీల మధ్య నమోదు అయ్యే ఛాన్స్ ఉండటంతో వాతావరణ శాఖ కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు,




వరంగల్, హన్మకొండ, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల. ఈ ప్రాంతాల్లో మధ్యాహ్నం వేళ జనం బయటకు రావడం ప్రాణాపాయమని అధికారులు హెచ్చరించారు. ఒకవైపు ఎండలు మండుతుంటే, మరోవైపు మంగళవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గాలి వాన బీభత్సం సృష్టించింది. మెదక్, సిద్ధిపేట జిల్లాల్లో అకాల వర్షం కురిసింది. భారీగా వీచిన గాలులు కారణంగా చెట్లు విరిగిపడం, ఇళ్ల రేకులు ఎగిరిపోవడం జరిగింది. కొన్ని ప్రాంతాల్లో ఆస్తి నష్టం పంట నష్టం కూడా జరిగింది. రానున్న 3-4 రోజుల పాటు ఈ ఎండల తీవ్రత ఇలాగే కొనసాగే అవకాశం ఉంది. అందుకే ప్రజలు ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ క్షేమంగా ఉండాలని సూచిస్తున్నారు.

**ఒక వైపు ఎండ.. మరో వైపు ఉక్కపోత..**

సూర్యభగవానుడు నరసింహా అవతారమెత్తాడు.. ప్రజలపై సూర్యాగ్రరూపం చూపిస్తున్నాడు.. మునుపెన్నడూ లేని విధంగా భూమి పై ఆక్రోశంతో అగ్నిఘోలం చూపిస్తున్నట్లు మంటలు మండిస్తున్నాడు.. ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువ ఈ ఏడాది బానుడు భగభగమండిపోతున్నాడు. గత నాలుగు రోజులుగా భానుడి ప్రతాపానికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. దీంతో తెల్లవారుజామున నుంచి ఎండ తన ప్రభావం చూపిస్తోంది. మధ్యాహ్నం 12గంటల నుంచి అగ్ని గోళంను తలపిస్తోంది.ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఎండలు మండిపోతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 48డిగ్రీల ఉష్ణోగ్రతలతో బానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గతేడాది 40డిగ్రీలతో ఆగిపోయిన ఎండలు, ఈ ఏడాది ఉగ్ర రూపాన్ని చూపిస్తున్నాయి. ఖమ్మం పట్టణం లో 44 డిగ్రీల నుండి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదవుతుంది.ఒక వైపు ఎండ, మరో వైపు ఉక్కపోత ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయం 7గంటల నుంచి రాత్రి 6గంటల వరకు ఎండు తీవ్రత ఎక్కువగా ఉండగా, 24గంటల పాటు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోజంతా చెమటలతో అల్లాడిపోతున్నారు. ప్రజలు, చిరు వ్యాపారులు, ముఖ్యంగా డ్రైవర్లు బెంబెలెత్తు తున్నారు. ఎండు, ఉక్కపోతకు కూలర్లు, ఏసీలు పనిచేయడం లేదు. ఎండ తీవ్రతకు ప్రజలు వణికిపోతున్నారు. ఉదయం 10 గంటలకు రోడ్లు కాళీ అవుతున్నవి. వీధి వ్యాపారాలు వారి వారి వ్యాపారాన్ని బంద్ చేసి, వారి వ్యాపార సామాగ్రికి జాబు కాగితాలతో కప్పి ఇళ్లకు వెళ్తున్నారు. రోడ్లన్నీ 10 గంటలకే ఖాళీ అవుతుండటముతో కొన్ని షాప్ ల వారు కూడా 11 గంటలకు షాప్ లను బంద్ చేసి ఇంటికి వెళ్తున్నారు. చిన్న పిల్లలు, పెద్ద వారు ఈ వేడి గాలులకు, ఊక్క పోతకి తట్టుకోలేక పోతున్నారు.సాయంత్రం 7 గంటలకు కూడా వేడి గాలులు తగ్గడం లేదు. ఇక బిల్డింగ్ కార్మికులు, రోజు వారి పనులు చేసికొనే వారి పరిస్థితి అత్యంత దారుణం. గతంలో కూడా మేము బిల్డింగ్ పనులు చేసాము, కానీ ఎన్నడూ ఇంత వేడి చూడలేదు అని అంటున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని మాకు ఇంట్లో వుంటే పూట ఎలా గడుస్తుందని రోజు వారి పనులు చేయనుకోనే వారు బిల్డింగ్ కార్మికులు అంటున్నారు.ఉదయం నుండి రాత్రి వరకు వుండి అమ్ముకొంటేనే మా ఇల్లు గడుస్తవి, ఈ ఎండల వలన 10 గంటలకే ఇళ్లకు వెళ్లి మళ్ళీ సాయంత్రం వస్తున్నాము, మా వ్యాపారాలు సగానికి సగం తగ్గావని, రెండు సార్లు ఇళ్లకు వెళ్ళటంతో ఖర్చులు కూడా పెరిగావని వీది వ్యాపారాలు చెబుతున్నారు.

**ప్రభుత్వం హెచ్చరిక**

ఎండల తీవ్రత మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉందని ప్రజలేవ్వరు బయటకు రావోద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నాయి. రాబోయే రోజుల్లో మరింత ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని, అవసరముంటేనే బయటకు రావాలని అధికారులు చెబుతున్నారు. తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంట్లో నుంచి బయటకు వెళ్ళవద్దని ప్రభుత్వం ప్రజలను హెచ్చరించింది.ఊరి ప్రయాణాలు రద్దు చేసుకోవాలని సూచించారు. అయితే ఎండలు తగ్గాలని ప్రజలు దేవుడ్ని జనం ప్రార్థిస్తున్నారు.. మరీ రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత పెరుగుతుందా..,? తగ్గుతుందా..? వేచి చూడాల్సిందే..?

## బండి సంజయ్, రేవంత్ రెడ్డి అనుబంధం వల్లనే

# ఆడబిడ్డకి అన్యాయం జరిగింది

**తమ రాజకీయాల కోసం ఆడబిడ్డకు అన్యాయం చేసిన వెధవ ఎవరో సమాధానం చెప్పాలి:- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్**గురువారం ముఖ్యమంత్రి చేసిన అడ్డగోలు వ్యాఖ్యల పైన కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక ఆడబిడ్డకు అన్యాయం జరిగిందని బయటకు వస్తే ఆ కుటుంబాన్ని బెదిరించి కౌంటర్ కేస్ పెట్టించి, నిందితుడిని తొమ్మిది రోజులు కాపాడింది ముమ్మాటికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే అన్నారు. మైనర్ బాలిక తనకు అన్యాయం జరిగిందని తల్లిదండ్రులతో పోలీస్ స్టేషన్కు వెళ్తే అర్ధరాత్రి వరకు నిలబెట్టి, తీవ్ర ఆవేదనకి గురిచేసింది రాష్ట్ర ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు.బండి సంజయ్, రేవంత్ రెడ్డి కలిసి తొమ్మిది రోజుల పాటు నిందితుణ్ణి కాపాడారని కేటీఆర్ ఆరోపించారు. కేవలం రాష్ట్ర హైకోర్టు బెయిల్ ఇవ్వనని తెగేసి చెప్పడం, తెలంగాణలోని ప్రతి ఒక్క ఆడబిడ్డ ప్రభుత్వాన్ని పైన దుమ్మెత్తి పోయడంతోనే సిగ్గు తెచ్చుకొని, చివరికి దిక్కులేని పరిస్థితుల్లో నిందితుణ్ణి అరెస్ట్ చేశారని కేటీఆర్ అన్నారు.రాష్ట్ర హోంశాఖకు బాధ్యుడిగా ఉన్న ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పర్యటన వల్ల పోలీసులంతా బిజీ ఉన్నారు అని అడ్డగోలు సాకులు చెప్పేందుకు చెప్పినందుకు సిగ్గుపడాలన్నారు.ముఖ్యమంత్రి చెప్పిన మాటలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. 'ప్రధానమంత్రి వస్తే మూడు రోజుల పాటు రేవంత్ రెడ్డి చంచల్గూడలో గడిపిన సన్నిహితులు బయట అడ్డగోలుగా నేరాలు చేయవచ్చా? అలాంటి కారణాలు చెప్పడానికి ప్రభుత్వానికి సిగ్గున్నదా?' అని కేటీఆర్ ప్రశ్నించారు.అత్యంత సున్నితమైన బాలిక విషయంలో పార్టీ తరపున మౌనంగా ఉన్నామని, ఏనాడూ రాజకీయం చేయలేదని కేటీఆర్ తెలిపారు. కానీ ఈ రోజు ముఖ్యమంత్రి మా పైన విమర్శలు చేసిన తర్వాతనే తప్పని పరిస్థితుల్లో ఈ




అంశం పైన మాట్లాడాల్సి వస్తున్నదని కేటీఆర్ తెలిపారు.ముఖ్యమంత్రి ఒక పోక్సో (గాజూూా) కేస్ నిందితుడిని తొమ్మిది రోజులు దాచిపెట్టిన సందర్భం దేశంలో ఎక్కడైనా ఉన్నదా అన్న విషయం పైన స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం కేంద్రమంత్రి బండి సంజయ్కి, రేవంత్ రెడ్డికి ఉన్న అనుబంధం వల్లనే ఇద్దరు కలిసి నిందితుణ్ణి తొమ్మిది రోజులు దాచి ఉంచారని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి సన్నిహితుడి ఆసుపత్రిలో తొమ్మిది రోజుల పాటు దాసపెట్టినారన్న వార్తలు వస్తున్నాయని, దీనిపైన ప్రభుత్వం విచారణ చేయాలన్నారు.ఆడబిడ్డకు అన్యాయం జరిగిందని బయటకు వస్తే ఆ అమ్మాయి కుటుంబం పైననే 'హనీ ట్రాప్' అంటూ కౌంటర్ కేస్ పెట్టి కుట్ర చేయించిన వెధవ ఎవరో చెప్పాలని బండి సంజయ్కి, ముఖ్యమంత్రికి కేటీఆర్ సవాలు విసిరారు. బండి సంజయ్ కొడుకు తనకు సంబంధం లేదని కోర్టు ద్వారా ఆర్డర్ తెచ్చుకున్నాడని, అంతటి దుర్మార్గమైన పరిస్థితి ఏ తండ్రికి రావద్దని కేటీఆర్ అన్నారు.ఈ మొత్తం పోక్సో కేసు విషయంలో హనీ ట్రాప్ అంటూ అడ్డగోలు వార్తలు రాసిన మీడియా, రాయించిన వ్యక్తులు ఎవరో, వ్యక్తులు ఎవరో సమాధానం చెప్పాలని కేటీఆర్ అన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్లు మీడియా కార్యాలయాలకు ఫోన్ చేసి కాళ్లా వేళ్లా పట్టుకొని వార్తలు రాకుండా ఆపింది వాస్తవం కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు.రాష్ట్రంలో ఎక్కడ ఆడబిడ్డలకు అన్యాయం జరిగినా కొట్లాడింది తామే అని, అది లగచర్ల నుంచి మొదలుకొని అనేక అంశాల్లో మా పార్టీ తరపున కొట్లాడుతున్నామని కేటీఆర్ అన్నారు.బండి సంజయ్తో తనకు ఎలాంటి పంచాయితీ లేదు అని, బండి సంజయ్ తన తండ్రి గురించి అడ్డగోలుగా మాట్లాడినా ఏ రోజు నేను స్పందించలేదని కేటీఆర్ తెలిపారు. ఈ రోజు కూడా బండి సంజయ్ని ఏమనడం లేదని, కేవలం నేరస్థుడు ఎవడైనా నేరస్థుడే అనే ఆలోచనతోనే మాట్లాడుతున్నామని కేటీఆర్ అన్నారు.బండి సంజయ్ మాదిరిగా తన కొడుకుకి తన తండ్రికి సంబంధం లేదని చెప్పుకునే పిరికివాణ్ణి కాదని, మా నాన్న పేరు కేసీఆర్, నా కొడుకు పేరు హిమాన్షు అంటూ కేటీఆర్ గట్టిగా కౌంటర్ ఇచ్చారు.పోక్సో కేసు విషయంలో జరుగుతున్న అన్యాయం పైన ప్రశ్నిస్తే 'మా బావమరిది ఇంటి పైన డ్రగ్స్ దాడి జరిగింది' అంటూ అడ్డగోలుగా మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి, కేసు ఎందుకు పెట్టడం లేదు అని, దమ్ముంటే కేసు పెట్టి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు

## ల్యాండ్ బ్యాంక్ ఎక్కడ...

**హైదరాబాద్, మే 22:**ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ఉద్దేశించిన 'ల్యాండ్‌బ్యాంక్' యాప్ రూపకల్పనలో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ భూముల వివరాలన్నింటినీ ఒకే చోట భద్రపరిచేందుకు రెండేళ్ల క్రితమే ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ యాప్ బాధ్యతలను తొలుత సీజీజీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) కి అప్పగించినప్పటికీ, ఆ తర్వాత మరో సంస్థ ఈ ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తామని ముందుకు వచ్చింది.ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలాలు, క్వార్టర్స్, వివిధ శాఖలకు కేటాయించిన భూములు, అలాగే కోర్టు వివాదాల్లో ఉన్న స్థలాల వివరాలను యాప్‌లో పొందుపరిచే ప్రక్రియ ఏడాది క్రితమే ప్రారంభమైనప్పటికీ ఇప్పటికీ పూర్తి కాలేదు. హైదరాబాద్‌లో ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కూడా అమలు చేయాలని భావించినా, యాప్ ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది.ప్రభుత్వ భూములను యాప్‌లో నమోదు చేసే సమయంలో బహుభుజి, జియో కోఆర్డినేట్ల పద్ధతిని ఉపయోగించాలని నిపుణులు సూచించారు. దీనివల్ల ఒక్క అంగుళం భూమి కూడా కొలతల్లో తేడా రాకుండా రికార్డవుతుంది. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడానికి ప్రయత్నిస్తే జియో కోఆర్డినేట్ల ద్వారా అధికారులకు సమాచారం అందుతుంది. క్షేత్రస్థాయి ఫోటోలు, మార్పుల వివరాలు కోర్టుల్లో బలమైన సాక్ష్యాధారాలుగా ఉపయోగపడతాయి.హైదరాబాద్ జిల్లాలోని నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములు, గృహ సముదాయాలను జియో ట్యాగింగ్ ద్వారా ఫోటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంపై రెవెన్యూ అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

## పీఎంజీఎస్‌వై పనులకు తెలంగాణకు మరిన్ని అనుమతులు, నిధులు ఇవ్వాలి

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్రాలకు ప్రత్యేక సడలింపులు అవసరమని తెలిపారు.ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ ఆసిఫాబాద్ వంటి ఆదివాసి, గిరిజన ప్రాంతాల్లో అటవీ, వన్యప్రాణి చట్టాల కారణంగా రోడ్డు పనులకు అనుమతులు ఆలస్యమవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. గిరిజనాభివృద్ధి, గ్రామీణ రవాణా సౌకర్యాల దృష్ట్యా అటవీ, వన్యప్రాణి నిబంధనల్లో అనుకూల మార్పులు చేయాలని కేంద్రాన్ని కోరారు.ప్పటికే ఉన్న పాత రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్న ప్రాంతాల్లో పునర్నిర్మాణం, అప్‌గ్రేడేషన్ పనులకు కూడా అటవీ నిబంధనలు అడ్డంకిగా మారాయన, ఆయా పనులకు సులభంగా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అటవీ సంరక్షణ చట్టాల్లో ఈ మధ్య తెచ్చిన మార్పులు ఆదివాసీల అభివృద్ధికి అటంకంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.లంగాణ ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, నాణ్యమైన రోడ్ల నిర్మాణం, నిర్వహణలో ఆధునిక సాంకేతికతలను వినియోగిస్తోందని మంత్రి తెలిపారు. గ్రామీణ రహదారుల నిర్వహణ కోసం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌ను రాష్ట్రం అమలు చేస్తోందన్నారు.**PMGSY-4** కింద తెలంగాణలో ఇంకా అనేక ప్రాంతాలకు రోడ్డు అనుసంధానం అవసరమని, మార్కెట్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, అభివృద్ధి కేంద్రాలకు గ్రామీణ ప్రజలు సులభంగా చేరుకునేలా మరిన్ని పనులు మంజూరు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖను కోరారు.మంత్రి చేసిన విజ్ఞప్తులపై కేంద్ర ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించిన అంశాలు, అభిప్రాయాలు, అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సెక్రెటరీ అతిథి సింగ్ తెలిపారు. అటవీ, వన్యప్రాణి చట్టాల కారణంగా ఎదురవుతున్న సమస్యలపై కేంద్ర స్థాయిలో చర్చించి, పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక అనుమతుల మంజూరు అంశాన్ని కూడా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు

## తెలుగు రాష్ట్రాల్లో మంత్రి వర్గ విస్తరణం

- మొదటి పేజీ తరువాయి

వినిపిస్తోంది. కేంద్ర క్యాబినెట్‌లో ఊస్టింగ్ ఎవరికి? కొత్తగా ఛాన్స్ దక్కెదెవరికి? తెలంగాణ క్యాబినెట్ ప్రక్షాళనలో పదవి పోయేదెవరిది? అమాత్య యోగం ఎవరిని వరించబోతోందనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది.తెలంగాణ మంత్రివర్గ ప్రక్షాళనలో భాగంగా పలువురు మంత్రులకు ఉద్వాసన తప్పదనే టాక్ ఎప్పటినుంచో వినిపిస్తోంది. మరికొందరి శాఖల మార్పులు ఉంటాయనే చర్చ ఉంది. సామాజిక సమీకరణాల ఆధారంగా..పనితీరు ఆధారంగా ఇద్దరు, ముగ్గురు మంత్రులను పక్కన పెట్టే అవకాశాలు ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలను రీప్లేస్ చేస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇక క్యాబినెట్‌లో ఇప్పటికే ఖాళీగా ఉన్న రెండు బెర్తులను కూడా భర్తీ చేసే ఛాన్స్ ఉందట. మొత్తంగా ఐదు మంత్రి పదవుల భర్తీ జరగనుందనేది కాంగ్రెస్ నేతల అంచనా. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఆది శ్రీనివాస్, రామచంద్రునాయక్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు బీర్ల అయిలయ్య, సుదర్శన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, విజయశాంతి పేర్లు మంత్రివర్గ రేసులో బలంగా వినిపిస్తున్నాయి.ఇక కేంద్ర క్యాబినెట్‌లో తెలంగాణ నుంచి క్యాబినెట్ ర్యాంక్‌తో జి.కిషన్ రెడ్డి, సహాయశాఖ మంత్రిగా బండి సంజయ్ ఉన్నారు. జాతీయ ప్రయోజనాలు.. రాష్ట్రంలోని పార్టీ అవసరాలను దృష్టిలో పెట్టుకొని కేంద్రమంత్రి వర్గంలో మార్పులు, చేర్పులు చేస్తారనే టాక్ బలంగా వినిపిస్తోంది. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ని పార్టీకి పని చేసేలా చేసి.. వారి స్థానాల్లో కొత్త వారికి అవకాశాలు ఇస్తారని కమలం పార్టీలో జోరుగా చర్చ నడుస్తోంది. అయితే కిషన్‌రెడ్డి, సంజయ్‌ని తప్పిస్తే..వారి స్థానంలో..అదే సామాజికవర్గానికి చెందిన నేతలకు చోటు కల్పిస్తారని అంటున్నారు. కిషన్ రెడ్డి ప్లేస్‌లో డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డిల పేర్లు బలంగా విన్పిస్తున్నాయి.కిషన్ రెడ్డి బెర్తుకు ఢోకా ఉండకపోవచ్చని..ఆ మేరకు ఆయనకు క్లారిటీ ఇచ్చారనే టాక్ కూడా నడుస్తోంది. ఇక బండి సంజయ్ ప్లేస్‌లో ధర్మపురి అరవింద్ లేదా ఈటల రాజేందర్‌కు ఛాన్స్ దక్కొచ్చన్న ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కకపోవడంతో..తనకు కేంద్రమంత్రి పదవి ఇస్తారని ఈటల బలంగా నమ్ముతున్నారట. ఏదేమైనా..గురువారం జరిగిన కేంద్ర క్యాబినెట్ భేటీ..23న జరిగే రాష్ట్రమంత్రి వర్గ సమావేశం..ఎవరెవరికి ఆఖరి క్యాబినెట్ భేటీ కాబోతోందో చూడాలి.

## రెండు ప్యాకేజీలుగా

# రీజినల్ రింగ్ రోడ్డు

- మొదటి పేజీ తరువాయి

జిల్లా గిర్మాపూర్ నుంచి సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ వరకు రూ.4,918.71 కోట్లు వ్యయంగా అంచనా వేస్తున్నారు. ప్యాకేజీ 2లో మొత్తం 78 కిలోమీటర్లు కాగా.. రూ.4,443.69 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇప్పటికే ప్యాకేజీ-1, ప్యాకేజీ-2లో భూమిని సేకరించారు. ఈ **RRR**లో 9చోట్ల నేషనల్ హైవేలు, స్టేట్ హైవేలు కనెక్ట్ అవుతాయి. 9 టోల్‌ప్లాజాల్లు, 44 పెద్ద బ్రిడ్జిలు, 127 చిన్న బ్రిడ్జిలు, 44 అండర్ పాస్‌లు, 4 ఆర్వోబీలు రానున్నాయి.రెండేళ్లుగా ఆర్ఆర్ఆఱ్ ఉత్తర భాగం పనులు వాయిదాపడుతున్నాయి. 2024 డిసెంబర్‌లో రీజినల్ రింగ్ రోడ్డును 4 వరుసలుగా ఐదు ప్యాకేజీలలో నిర్మించేందుకు టెండర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. వాస్తవానికి ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులకు సంబంధించి గతేడాది నవంబరు నెలలో ఆరు వరుసలుగా ఐదు ప్యాకేజీలుగా విభజించి ఎన్‌హెచ్ఏఐ టెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. కానీ కొన్ని కారణాలతో బిడ్‌లు దాఖలు కాలేదు. ఎన్‌హెచ్ఏఐ ఈ ఏడాది ఫిబ్రవరిలో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తరభాగం పనులను రెండు ప్యాకేజీలకు కుదించింది. అలాగే ఆర్ఆర్ఆర్‌కు ఎన్‌హెచ్-161ఏఏ నంబరు కూడా కేటాయించారు. తాజాగా రెండు ప్యాకేజీలుగా మార్చి నోటిఫికేషన్ కూడా ఇచ్చారు. ఈ బిడ్‌లు తెరిచిన టెండర్ ఖరారు చేసిన తర్వాత లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ అందిన మూడేళ్లలో పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది. అన్నీ కుదిరితే 2029నాటికి ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. మొత్తం మీద ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించి టెండర్లు ప్రక్రియ మొదలైంది.

## తెలంగాణలో గ్రామాల అభివృద్ధికి బ్యాంకులు భాగస్వాములు కావాలి

- మొదటి పేజీ తరువాయి

ఉద్యానవన రంగంతో పాటు ఆయిల్ పామ్ సాగుకు అపారమైన అవకాశాలు ఉన్నాయి. ఈ రంగాలకు బ్యాంకులు పెద్దపీట వేయాలి. పంట నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, సైలోల నిర్మాణానికి బ్యాంకులు ఉదారంగా రుణాలు ఇవ్వాలి. అలాగే రాష్ట్రంలో ఉన్న దాదాపు వెయ్యి రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు తగిన ఆర్థిక మద్దతు అందించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉంది. వ్యవసాయాన్ని ఆధునికీకరించేందుకు, యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు గానూ ప్రభుత్వం రూ.147.91 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పంట రుణాలు అందేలా బ్యాంకులు బాధ్యత తీసుకోవాలి. వీటితో పాటూ పర్యావరణ హితమైన సోలార్ వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్ పద్ధతులకు రుణ సదుపాయాన్ని గణనీయంగా పెంచాలి' అని మంత్రి తెలిపారు.

# కారులో.. హుషారు!

- మొదటి పేజీ తరువాయి

సభ్యత్వాలపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. పార్టీలో సభ్యులుగా చేరిన వారి వివరాలను వీరు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తారు. బూత్ వారీగా సభ్యత్వాలను పరిశీలించడానికి మండల స్థాయిలో ఐదుగురితో కూడిన సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. వీరికి అప్పగించిన బూత్‌లను నిత్యం పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ మండల సమన్వయ కమిటీ తమ నివేదికను నియోజకవర్గ ఇన్‌చార్జులకు నియోజకవర్గ ఇన్‌చార్జులు ఉమ్మడి జిల్లా సమన్వయకర్తగా ఉన్న గ్యాదరి బాలమల్లుకు వివరాలు సమర్పించాలి. సాధ్యమైనంత ఎక్కువ సభ్యత్వాలు చేయాలని పార్టీ దిశానిర్దేశం చేసింది.

**స్త్రపార్టీ పదవులపై గురి**

కొత్తగా ఏర్పాటవుతున్న పార్టీ కమిటీలపై ఆశావహులు దృష్టిసారించారు. ఏళ్ల తరబడిగా గ్రామ, మండల, జిల్లాలకు పాత కమిటీలనే కొనసాగించారనే అభిప్రాయాలున్నాయి. అధ్యక్షులు మినహా కమిటీలోని ఇతర పదవులను భర్తీ చేయకపోవడంపైనా ఇప్పటి వరకు అసంతృప్తి వ్యక్తపరిచారు. ఈ క్రమంలోనే పాత కమిటీలను రద్దుచేసి కొత్త కమిటీలకు కసరత్తు ప్రారంభించిన క్రమంలో ఆశావహులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇవే కమిటీలను వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు కొనసాగించనున్న తరుణంలో తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. ప్రధానంగా గ్రామ, మండలాల కమిటీ అధ్యక్ష, ఇతర పదవుల కోసం ఇప్పటి నుండే ముఖ్య నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్లు అనుకూలించని వారు, టికెట్లు దక్కనివారు కనీసం పార్టీ పదవుల్లోనైనా అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

**వారికే 'జిల్లా' బాధ్యతలు..**

పార్టీని ముందుకు నడిపించే జిల్లా అధ్యక్షులపైనే అందరి దృష్టి నెలకొన్నది. నిన్నటిదాకా సిద్దిపేటకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, సంగారెడ్డికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మెదక్‌కు మాజీ ఎమ్మెల్యే పద్మ బాధ్యతలు నిర్వర్తించారు. వీరంతా అనుభవజ్ఞులే కావడంతో క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకున్నారు. ప్రస్తుతం కమిటీలు రద్దు కావడంతో కొత్త రథసారథుల ఎంపిక అనివార్యమైంది. సభ్యత్వాల నమోదు పూర్తయిన తర్వాత జిల్లా అధ్యక్షుడిని ముందుగా ఎన్నుకుంటారా.. లేదంటే గ్రామ, మండల కమిటీలను ఎన్నుకున్నాకే నిర్ణయం తీసుకుంటారా అనే విషయంపై స్పష్టత లేదు. పార్టీ అధినేత కేసీఆర్ సిద్దిపేట జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఇక్కడి బాధ్యతలన్నీ హరీశ్‌రావుకే అప్పగిస్తుంటారు.

## నిమ్స్‌లో 2000

# కిడ్నీ మార్పిడిలు..

- మొదటి పేజీ తరువాయి

నిమ్స్ మూడో స్థానంలో నిలిచింది.ఈ అరుదైన మైలురాయిని సాధించి కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందించిన నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ 2,000 మందిలో 1,900 మంది అంటే 95% మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయించుకోవటం విశేషం. 2023 జనవరి నుంచి గడిచిన మూడేళ్ల నాలుగు నెలల్లోనే.. 500 కిడ్నీ మార్పిడులు చేసి నిమ్స్ రికార్డు నెలకొల్పింది.

## డిప్యూటీ కలెక్టర్ నివాసంలో ఏసీబీ సోదాలు.. కేసు నమోదు




**హైదరాబాద్, మే 22**: మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా గతంలో పని చేసిన వంశీ మోహన్ నివాసంలో ఏసీబీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లోని ఆయనకి సంబంధించిన 8 ఇళ్లపై ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేసి తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో వంశీ మోహన్‌కు సంబంధించి.. రూ.వందల కోట్ల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. అతడిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును అధికారులు నమోదు చేశారు. పెద్దఎత్తున ప్రభుత్వ ఆస్తులు కాజేసినట్లు వంశీ మోహన్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఈ సోదాలు నిర్వహించారు. శేరిలింగంపల్లితో పాటు పలు ప్రాంతాల్లో వంశీ మోహన్ ఆర్డీవోగా పనిచేశారు. అలాగే అబ్దుల్లాపూర్ మెట్, పిగ్లీపురంలో 8 ఎకరాల భూమిని ఆయన కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు భూమిని తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి.. దానిని రియల్టర్‌కు కట్టెబట్టినట్లు విమర్శలు వచ్చాయి. ఇక ఓ రియల్టర్ నుంచి 10 ప్లాట్లు గిఫ్ట్ డీడ్‌ను వంశీ మోహన్ తీసుకున్నట్లు కూడా ఈ సోదాల్లో ఏసీబీ గుర్తించినట్లు తెలుస్తుంది. ఈ ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో వంశీ మోహన్‌ను ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు.

## కొండుర్గ్ పీఎస్ ను తనిఖీ చేసిన సీపీ తరుణ్ జోషి

**హైదరాబాద్:**ఫ్యూచర్ సిటీ కమిషనర్ డా. తరుణ్ జోషి కొండుర్గ్ పోలీస్ స్టేషన్లో ఆకస్మిక తనిఖీ జరిపారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యేకంగా ఆరా తీసారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పోలీసులకు ఆదేశం ఇచ్చారు. చట్ట అమలులో కఠినంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. స్టేషన్కు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరిగేలా విధులు నిర్వహించాలని సూచాంచారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎక్కువగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

## తిరుమల కొండపై భక్తుల కిటకిట...

**శ్రీవారి దర్శనానికి 24 గంటల సమయం**

**వేసవి సెలవులతో తిరుమలకు పోటెత్తిన భక్తులు**

**శ్రీవారి సర్వదర్శనానికి 18 నుంచి 24 గంటల సమయం**

**నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు**

**గురువారం ఒక్కరోజే రూ.4.35 కోట్ల హుండీ ఆదాయం**



కలియుగ దైవం తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. వేసవి సెలవులు కావడంతో దేశం నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తుండటంతో తిరుమల గిరులు భక్తజన సంద్రంగా మారాయి. రద్దీ విపరీతంగా పెరగడంతో శ్రీవారి సర్వదర్శనానికి గంటల తరబడి సమయం పడుతోంది. ప్రస్తుతం తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఉన్న అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూ లైన్లు శ్రీవారి సేవా సదన్ వరకు విస్తరించాయి. ఎటువంటి టోకెన్లు లేని భక్తులకు స్వామివారి సర్వదర్శనం కోసం దాదాపు 18 నుంచి 24 గంటల సమయం పడుతోంది. గురువారం నాడు శ్రీవారిని 79,603 మంది భక్తులు దర్శించుకున్నారు. 45,125 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా శ్రీవారి హుండీ ఆదాయం కూడా భారీగా నమోదైంది. నిన్న ఒక్కరోజే స్వామివారికి హుండీ ద్వారా రూ.4.35 కోట్ల ఆదాయం వచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు.

## సీఎం రేవంత్ ప్రత్యక్షంగా కొనుగోలు కేంద్రాలకు వెళ్లి రైతులకు భరోసా కల్పించాలి

**కవిత**




**హైదరాబాద్:**తెలంగాణ రక్షణ సేన అధ్వర్యంలో శుక్రవారం నాడు నిరసన కార్యక్రమం జరిగింది. పార్టీ ఆధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, తదితరులు పాల్గొన్నారు.కవిత మాట్లాడుతూ రైతుల గోస పట్టని సర్కారుకు బుద్ధి రావాలని సెక్రటేరియట్ ముందు నిరసన తెలపడం జరిగింది.ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన పంటలను కొనుగోలు చేసి వారికి బాసటగా నిలవాలన్న సోయి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేదని విమర్శించారు.మండుతున్న ఎండలతో వడదెబ్బకు గురై కల్లాల్లోనే ఊపిరి వదులుతున్నారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, మక్కలు, పొద్దుతిరుగుడు పువ్వు, జొన్నలను ఆరబెడుతూ కాంటా వేసే వారి కోసం ఎదురు చూస్తున్నారు. తూకంలో తరుగు తీస్తున్నారు. తేమ పేరిట కొనుగోళ్లను ఆలస్యం చేస్తున్నారు. ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్ గా చెప్తూ రైతులను మిల్లర్లు మోసం చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. రెండున్నరేళ్లుగా వ్యవసాయ శాఖను సమీక్షించని సీఎం రేవంత్ రెడ్డి ఈ రాష్ట్రానికి పట్టిన దరిద్రం. ఇప్పటికైనా ముఖ్యమంత్రి బుద్ధి తెచ్చుకుని ప్రత్యక్షంగా కొనుగోలు కేంద్రాలకు వెళ్లి రైతులకు భరోసా కల్పించాలని అన్నారు.పండిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తున్నది. ఇవాళ సెక్రటేరియట్ ముందు వడ్లు పోసి నిరసన తెలిపాం. ఇది శాంపిల్ మాత్రమే... వానలు పడే లోపే కొనుగోళ్లను పూర్తిచేయకపోతే... తెలంగాణ రక్షణ సేన రంగంలోకి దిగుతుంది. మీ మంత్రులు, ఎమ్మెల్యేలు తెలంగాణలో తిరగలేని పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరిస్తున్నామని అన్నారు.

# అడుగుకో అవినీతి తిమింగళం...

**హైదరాబాద్, మే 22:**:హైదరాబాద్ జలమండలి జనరల్ మేనేజర్ కుమార్ నివాసాలపై జరిగిన ఏసీబీ దాడులు, అక్కడ బయటపడిన రూ. 100 కోట్ల అక్రమ ఆస్తుల ఉదంతం నగరంలో అవినీతి ఏ స్థాయిలో వేళ్లూనుకుందో మరోసారి నిరూపించింది. నెలకు లక్షన్నర రూపాయల పరిమిత జీతం తీసుకునే ఒక ప్రభుత్వ ఉద్యోగి, కొద్ది సంవత్సరాల వ్యవధిలోనే ఇంతటి భారీ సామ్రాజ్యాన్ని ఎలా నిర్మించగలిగారనే ప్రశ్న సామాన్యుడిని విస్మయానికి గురిచేస్తోంది. హైదరాబాద్ మహానగర పరిధిలోని ప్రభుత్వ శాఖలైన జీహెచ్ఎంసీ, జలమండలి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ , టౌన్ ప్లానింగ్ విభాగాల్లో అవినీతి అనేది ఒక సమాంతర ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందింది. లంచాల రూపంలో వస్తున్న ఈ అక్రమ సొమ్మంతా మెట్రో నగర శివార్లలోని రియల్ ఎస్టేట్ రంగంలోకి అడ్డూఅదుపూ లేకుండా ప్రవహిస్తోంది. ఐటీ కారిడార్‌లోని విలాసవంతమైన గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, రీజినల్ రింగ్ రోడ్డు పరిసరాల్లోని వందలాది ఎకరాల ల్యాండ్ బ్యాంకులు మెజారిటీ భాగం ఇలాంటి కలుషిత సంపాదనతోనే కొనుగోలు చేస్తున్నారు. నిజాయితీగా సంపాదించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు లేదా వ్యాపారవేత్తల కంటే, ఇరుకు గదుల్లో కూర్చునే అవినీతి ప్రభుత్వ అధికారులే నేడు రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను శాసిస్తూ ధరలను కృత్రిమంగా పెంచుతున్నారు.అక్రమార్కులను పట్టుకోవడానికి ఏసీబీ దాడులు నిర్వహిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ కేసుల పర్యవసానాలు శూన్యంగా మారుతున్నాయి. ఇటీవల వెలువడిన గణాంకాల ప్రకారం, తెలంగాణ ఏసీబీ నమోదు చేస్తున్న కేసుల్లో నిందితులకు కోర్టుల ద్వారా శిక్షలు పడుతున్న రేటు అత్యంత నిరాశాజనకంగా ఉంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో శిక్షల శాతం కేవలం 20 నుండి 25 శాతం లోపే ఉంటోంది. అంటే, పట్టుబడిన ప్రతి పది మంది అవినీతి



అధికారుల్లో కనీసం ఏడుగురు చట్టంలోని లోపాల ద్వారా క్లీన్ చిట్‌తో బయటకు వస్తున్నారు లేదా కేసులను దశాబ్దాల పాటు సాగదీసి సాక్ష్యాలు లేకుండా చేస్తున్నారు. ఈ సేఫ్ ఎగ్జిట్ భరోసాయే అధికారులను మరింతగా బరితెగించేలా చేస్తోంది.ఈ వైఫల్యానికి ప్రధాన కారణం ఏసీబీ దర్యాప్తులో కనిపిస్తున్న లోపాలు . పక్కా సాక్ష్యాధారాలను కోర్టుల ముందుంచలేకపోవడమే. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఆస్తుల విలువను కట్టేటప్పుడు దర్యాప్తు అధికారులు మార్కెట్ విలువను కాకుండా పాత రిజిస్ట్రేషన్ విలువను ప్రామాణికంగా తీసుకోవడం నిందితులకు మేలు చేస్తోంది. బెనామీల పేరిట ఉన్న ఆస్తులకు, సదరు అధికారికి ఉన్న ఆర్థిక సంబంధాలను చట్టబద్ధంగా నిరూపించడంలో విఫలమవుతోంది. దీనికి తోడు, కేసు నమోదైన తర్వాత చార్జ్‌షీట్ దాఖలు చేయడానికే ఏసీబీకి సంవత్సరాల సమయం పడుతుండటంతో కీలక సాక్ష్యాలు కనుమరుగవుతున్నాయి.పట్టుబడిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో మరియు న్యాయస్థానాల్లో విచారణ జరపడానికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు రావడంలో జరుగుతున్న జాప్యం అవినీతి నిరోధక చట్టం ఆత్మను దెబ్బతీస్తోంది. ఉన్నతాధికారుల, రాజకీయ నాయకుల అండదండలు ఉన్న లంచగొండులకు ఈ శాంక్షన్లు రాకుండా తెరవెనుక పెద్ద ఎత్తున లాబీయింగ్ సాగుతుంది. ఒకవేళ ఏసీబీ గట్టిగా ప్రయత్నించి సస్పెండ్ చేయించినా, కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే వారు ట్రిబ్యునళ్లు లేదా కోర్టుల నుండి స్టేలు తెచ్చుకుని, తిరిగి అదే శాఖల్లో కీలకమైన పోస్టుల్లో కొలువుదీరుతున్నారు. జలమండలి కేసులోనూ గతంలో ఇలాంటి అనుభవాలే వెలుగుచూశాయి. అవినీతి అధికారులు తమ సంపాదనను కేవలం నగదు రూపంలో కాకుండా, ఇతర దేశాల్లో పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీ లేదా సుదూర ప్రాంతాల్లో బినామీల పేరుతో భూములుగా మారుస్తున్నారు. ఏసీబీ వద్ద ఉన్న పాత తరం దర్యాప్తు పద్ధతులు ఈ ఆధునిక వైట్ కాలర్ నేరాలను ఛేదించలేకపోతున్నాయి. ఫోరెన్సిక్ ఆడిటింగ్ మరియు డిజిటల్ ఎవిడెన్స్ సేకరణలో ఏసీబీ బలోపేతం కాకపోవడం వల్ల, కోర్టుల్లో నిందితుల తరపు న్యాయవాదులు సాంకేతిక కారణాలతో కేసులను కొట్టివేయించగలుగుతున్నారు. దీనివల్ల పట్టుబడటం అనేది ఒక చిన్న ప్రమాదం మాత్రమే, శిక్ష పడటం అసాధ్యం అనే భావన అవినీతి తిమింగలాల్లో బలపడింది. ఏసీబీ కేవలం దాడుల నాటి హంగామాకే పరిమితం కాకుండా, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా ఏడాది లోపే నిందితుల ఆస్తులను జప్తు చేసే అధికారాలను పొందాలి. పట్టుబడిన వెంటనే ఆస్తులను ప్రభుత్వ పరం చేసే విధానం వస్తేనే భయం మొదలవుతుంది. ఏసీబీకి స్వయంప్రతిపత్తి కల్పించడంతో పాటు, ప్రాసిక్యూషన్ విభాగాన్ని అత్యున్నత స్థాయి న్యాయ నిపుణులతో బలోపేతం చేయాలి. అప్పుడే, లక్షల్లో జీతం ఉండి కోట్లలో ఆస్తులు కూడబెట్టే అధికారుల అక్రమ దాహానికి బ్రేకులు పడతాయన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# మణుగూరు-రామగుండం రైల్వే లైన్

**కరీంనగర్, మే 22:**రామగుండంలో రైలు ఎక్కి మేడారంలో మొక్కులు చెల్లించుకొని, ఆ తర్వాత భద్రాచలంలో రైలు దిగి రాముణ్ని దర్శించుకుంటే..? భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) స్టేషన్లో రైలు ఎక్కి విశాఖపట్నంలో దిగి బీచ్‌లో ఎంజాయ్ చేసి.. మళ్లీ భద్రాచలం రోడ్ మీదుగానే రామగుండం వెళ్లిపోతే..? ఊహ భలే ఉంది కదా. కొత్తగా ఏర్పాటు కానున్న రామగుండం-మణుగూరు రైల్వే లైన్‌తోపాటు.. ఇప్పటికే రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన భద్రాచలం రోడ్-కొవ్వూరు రైల్వే లైన్ ఏర్పాటయితే ఈ కల త్వరలోనే సాకారం కానుంది.తెలంగాణలో మరో కొత్త రైల్వే మార్గం అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు, పారిశ్రామిక కేంద్రాలను కలుపుతూ కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కానుంది. మణుగూరు-రామగుండం కొత్త రైలు మార్గాన్ని ఐదేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.5818.45 కోట్లు ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును పబ్లిక్-ప్రయివేట్ భాగస్వామ్యంలో పూర్తి చేయనున్నారు. 207.8 కిలోమీటర్ల పొడవైన ఈ రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే.. మణుగూరు-రామగుండం మధ్య 90 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ప్రస్తుతం మణుగూరు నుంచి రామగుండం వెళ్లడానికి భద్రాచలం రోడ్, కాజీపేట మీదుగా చుట్టూ తిరుగుతూ ప్రయాణించాల్సి వస్తోంది.కొత్త రైల్వే అందుబాటులోకి వస్తే భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, పెద్దపల్లి జిల్లాల్లోని మారుమూల గిరిజన ప్రాంతాలకు రైలు సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. గిరిజనుల అతిపెద్ద జాతర జరిగే మేడారం ప్రాంతానికి రైలులో వెళ్లొచ్చు. మంథని, భూపాలపల్లి, మేడారం, తాడ్వాయి, గోపాలరావుపేట మీదుగా ఈ రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ రైలు మార్గం న్యూఢిల్లీ-చెన్నై మార్గంలోని విజయవాడ-నాగ్‌పూర్ సెక్షన్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది.ప్రజా రవాణాతోపాటు బొగ్గు, ఎరువులు, ఆహార ధాన్యాలు, ఖనిజాల ఎగుమతులకు ఈ రైల్వే మార్గం కీలకం కానుంది. పెద్దపల్లి, ములుగు జిల్లా ప్రజలు మేడారం, భద్రాచలం లాంటి ఆధ్యాత్మిక పర్యాటక ప్రదేశాలకు తక్కువ ఖర్చుతో, సౌకర్యవంతంగా వెళ్లడానికి వీలవుతుంది.ఏడాదిలోగా భూసేకరణ చేపట్టాలని.. మరో నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. భూసేకరణ, అనుమతులు, డీపీఆర్ రూపకల్పన లాంటి పనులను రైల్వే శాఖ చూసుకుంటుంది. రైలు మార్గం నిర్మాణం, నిధుల సమీకరణతోపాటు 45 ఏళ్లపాటు ఈ రైలు మార్గ నిర్వహణ బాధ్యతను ప్రయివేట్ సంస్థకు అప్పగిస్తారు. రైల్వే శాఖ పీపీపీ మోడల్‌కు సంబంధించి ప్రతిపాదనలను రూపొందించిన తర్వాత టెండర్లను ప్రారంభిస్తారు.ఈ కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే.. మారుమూల గిరిజన ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. భద్రాచలం నుంచి రామగుండం చేరుకోవడం సులభం అవుతుంది. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి భద్రాచలం-పాండురంగాపురం వరకు 186 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్‌కు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ లైన్‌కు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తయ్యింది. అలాగే భద్రాచలం రోడ్ (కొత్తగూడెం), డోర్నకల్ స్టేషన్ల మధ్య డబుల్ లైన్ పనులు జరుగుతున్నాయి. దీంతోపాటు భద్రాచలం రోడ్ నుంచి ఆంధ్రాలోని కొవ్వూరు వరకు రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే తెలంగాణలోని సత్తుపల్లి వరకు 56 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ ఏర్పాటు చేశారు. ఈ మార్గాన్ని బొగ్గు రవాణా కోసం ఉపయోగిస్తున్నారు. సత్తుపల్లి నుంచి కొవ్వూరు రైల్వే



లైన్ కోసం డీపీఆర్ సిద్ధమైంది. భద్రాచలం రోడ్-కొవ్వూరు లైన్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్, విశాఖపట్నం నగరాల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.మరో 5-10 ఏళ్లలో ఈ మూడు రైల్వే మార్గాలు పూర్తయితే.. భద్రాచలం రోడ్ మీదుగా విశాఖ నుంచి రామగుండం, హైదరాబాద్ లాంటి నగరాలకు రైళ్లను నడపొచ్చు. గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర జిల్లాలకు.. ఉత్తర తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాలకు, ఒడిశాలోని గిరిజన ప్రాంతాలకు భద్రాద్రి జిల్లాలోని రైల్వే స్టేషన్లు జంక్షన్‌లా మారతాయి.రామగుండం రైల్వే స్టేషన్‌కు ఉత్తర భారతదేశంలోని న్యూఢిల్లీ, ఆగ్రా, లక్నో, వారణాసి, గ్వాలియర్, నాగ్‌పూర్, ముంబై లాంటి కీలక నగరాలతోపాటు.. సౌతిండియాలోని చెన్నై, బెంగళూరు, తిరువనంతపురం లాంటి కీలక నగరాలతో రైల్వే పరంగా అనుసంధానం ఉంది. ఈ కొత్త రైల్వే మార్గం అందుబాటులోకి వస్తే రామగుండం నుంచి విశాఖపట్నం, రాజమండ్రి లాంటి నగరాలకు దూరం తగ్గడంతోపాటు కనెక్టివిటీ మెరుగవుతుంది.

## జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

**ఎంపి ఈటల**

**సికింద్రాబాద్:**అఖిల పక్ష నాయకులు, ప్రభుత్వ, రాంకీ అధికారులతో కలిసి ఎంపీ ఈటల రాజేందర్ జవహర్ నగర్ డంప్ యార్డ్ లో క్షేత్ర పరిశీలన చేసి సమీక్ష నిర్వహించారు.తరువాత మీడియాతో మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో పదివేల మెట్రిక్ టన్నుల చెత్త ఒకే దగ్గర జమ అయ్యే విధానం ఎక్కడ లేదు. ఈ చెత్తను రీసైకిల్ చేస్తామని ప్రభుత్వంతో రాంకీ సంస్థ చేసుకున్న ఒప్పందం అమలు చేయడం లేదు. దీనివల్ల 40 కిలోమీటర్ల పరిధిలో ఉన్న చెరువులన్నీ కూడా నాశనం అయ్యాయి. భూగర్భ జలాలు విషతుల్యం అయ్యాయి. లక్షల మంది ప్రజల ఆరోగ్యం గాలిలో కలిసిపోయింది. కడుపుతో ఉన్నవారికి అబార్షన్లు అవుతున్నాయి. పశు సంపద చనిపోతుంది. వాతావరణ సమతుల్యత దెబ్బతిన్నది. మనిషి నివసించలేని ప్రాంతంగా మారిపోయిందని అన్నారు.జీరో డిస్చార్జ్ ఉంటుందని, కాలుష్యం ఉండదనే.. కండిషన్స్ అన్ని తుంగలో తొక్కబడ్డాయి. గాలి నీరు ధ్వని కాలుష్యంతో ఈ ప్రాంత ప్రజలు ఆరోగ్యం పాడయింది. దీనిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి ని కలిసాము. మీరు ఈ ప్రాంత ఎంపీగా పనిచేశారు జవహర్ నగర్ డంప్ యార్డ్ సమస్య మీద మీకు సంపూర్ణ అవగాహన ఉంది.. ఇప్పుడు మీరు సమస్య తీర్చే స్థానంలో ఉన్నారు.. ప్రపంచంలో అనేక అభివృద్ధి చెందిన దేశాలు తిరిగి టెక్నాలజీ చూసి వస్తున్నారు.. బాలాజీ నగర్ లో ఈ డంపు యార్డు నుంచి ఈ ప్రజలకు విముక్తి ఉందా లేదా ? అని అడిగాము. అఖిలపక్ష నాయకులు రాంకీ అధికారులు ప్రభుత్వ అధికారులతో మాట్లాడమని చెప్తే నిన్న ఈరోజు సమావేశాలు ఏర్పాటు చేశాము. క్షేత్ర స్థాయి పరిశీలన చేశాము. కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డితో కలిసి రాంకీ ప్రతినిధులతో పరిశీలన చేశాము. దీనిమీద మూడు రోజుల్లో ఒక రిపోర్ట్ తయారు చేయమని ఆదేశించాము.



రిపోర్ట్ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రితో భేటీ అయి శాశ్వత పరిష్కారం కనుగొనడం.. ఒకే దగ్గర చెత్త వేయడం కాకుండా పదిచోట్ల వేయడం ద్వారా కాలుష్యం లేకుండా చూడడం కోసం ప్రయత్నం చేస్తున్నాము. రాజకీయాలతో సంబంధం లేకుండా శాశ్వత పరిష్కారం అందిస్తామని అన్నారు.భారతీయ జనతా పార్టీ జవహర్ నగర్ డంప్ యార్డ్ కి వ్యతిరేకంగా అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తుంది. అనేక కేసులు అయ్యాయి, మా వాళ్ళు జైలు పాలు కూడా అయ్యారు. నేను ఈ ప్రాంత ఎంపీగా శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తున్నాను. కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకుంటాము. చెత్త సేకరణ నిర్వహణ రాంకీ సంస్థ చేస్తుంది. కానీ ప్రతిరోజూ వచ్చే చెత్తలో సగం కూడా రీసైకిల్ చేయడం లేదు. దీనివల్ల చెత్త పేరుకుపోతుంది, దాని నుండి వచ్చే చెడు నీటితో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. జేఏసీ లు పోరాటం చేస్తున్నాయి కానీ పెద్ద పెద్ద లాయర్లను పెట్టుకొని తప్పుడు రిపోర్ట్స్ ఇచ్చి బయటపడుతున్నారు తప్ప వీరికి నిజాయితీ లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఐజజ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, బుద్ధి శ్రీనివాస్, విక్రమ్ రెడ్డి, ఏనుగు సుదర్శన్ రెడ్డి, నాయకులు, జవహర్ నగర్ ప్రజలు పాల్గొన్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 10 కేజీల గాంజా స్వాధీనం..

**ఒకరి అరెస్ట్**




**హైదరాబాద్, మే 22:** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో(శంషాబాద్) మరోసారి గాంజా స్మగ్లింగ్ యత్నం బయటపడింది. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి లగేజీలో 10 కేజీల గాంజాను కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. గాంజా స్మగ్లింగ్ చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. లగేజీ బ్యాగ్ కింది భాగంలో ప్రత్యేకంగా తయారు చేసిన ప్యాకెట్లలో గాంజాను దాచి తరలించేందుకు ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. స్కానింగ్ సమయంలో అనుమానాస్పదంగా కనిపించడంతో లగేజీని తనిఖీ చేయగా గాంజా స్మగ్లింగ్ ఉదంతం బయటపడింది. అధికారులు గాంజాను స్వాధీనం చేసుకుని.. నిందితుడిని ముమ్మరంగా విచారిస్తున్నారు. ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. స్మగ్లింగ్ నెట్‌వర్క్ వెనుక ఉన్నవారిని గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు కొన్ని నెలలుగా డ్రగ్ స్మగ్లింగ్‌కు హాట్ స్పాట్‌గా మారింది. బ్యాంకాక్, దుబాయ్ వంటి నగరాల నుంచి గాంజా తరలింపు యత్నాలు తరచుగా జరుగుతున్నాయి. ఏప్రిల్ నెలలో 13.2 కేజీల గాంజా పట్టుబడగా.. ఓ ప్రయాణికుడిని అధికారులు అరెస్ట్ చేశారు. ఈనెలలో(మే నెల) రెండు సందర్భాల్లో 8.7 కేజీల గాంజాను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికులు బాటిళ్లు, స్నాక్స్ టిన్లలో గాంజాను దాచినట్లు అధికారులు తెలిపారు.

# పప్పు దినుసులను తిన్న తరువాత జీర్ణ సమస్యలు వస్తున్నాయా.. అయితే వాటిని ఇలా తీసుకోండి..



పప్పులు భారతీయ ఆహారంలో కీలక భాగంగా ఉంటాయి. ఇవి ప్రోటీన్, ఫైబర్, అవసరమైన పోషకాలతో నిండి ఉండడంతో రోజువారీ భోజనంలో ఎక్కువగా వాడుతుంటారు. అయితే పప్పులు తిన్న తర్వాత కొందరికి పొట్ట ఉబ్బరం, బరువుగా అనిపించడం, గ్యాస్ వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. అయితే దీనికి పప్పులు కారణం కాకపోవచ్చని, వాటిని సరైన విధంగా సిద్ధం చేయకపోవడమే ప్రధాన కారణమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పప్పులు వండే ముందు నానబెట్టడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. అయితే అన్ని రకాల పప్పులకు ఒకే విధమైన నానబెట్టే సమయం సరిపోదని చెబుతున్నారు. ఏ పప్పును ఎంతసేపు నానబెట్టాలో తెలుసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు పొట్ట ఉబ్బరం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉందని వివరిస్తున్నారు.

**రాత్రంతా నానబెట్టడం మంచిది..**

చిన్న పరిమాణంలో ఉండే పూర్తి గింజల పప్పులు ఇతర పెద్ద లెగ్యూమ్స్‌తో పోలిస్తే తేలికగా జీర్ణమవుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని సుమారు 7 నుంచి 8 గంటలు, ముఖ్యంగా రాత్రంతా కొద్దిగా ఉప్పు వేసి నానబెట్టడం మంచిదని సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల పప్పులు మెత్తబడటంతో పాటు వండటానికి సులభమవుతాయి. జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుందని చెబుతున్నారు. అలాగే రాజ్మా, శనగలు, చోలే వంటి పెద్ద లెగ్యూమ్స్‌కు మరింత సమయం అవసరమని చెబుతున్నారు. వీటి పై పొర గట్టిగా ఉండటంతో జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. అందువల్ల ఇవి గ్యాస్, పొట్ట ఉబ్బరం వంటి సమస్యలకు కారణమవుతాయని వివరిస్తున్నారు. కనీసం 10 నుంచి 12 గంటల పాటు రాత్రంతా నానబెట్టాలని సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల జీర్ణానికి ఇబ్బంది కలిగించే కొన్ని సంయోగాలు తగ్గిపోతాయని అంటున్నారు.

**పొట్టు తీస్తే**

**ఎక్కువ సేపు అవసరం లేదు..**

అలాగే పొట్టు తీసిన రకాలైన కందిపప్పు, మినప పప్పు వంటి వాటికి ఎక్కువసేపు నానబెట్టాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. వీటిలో బయటి పొర లేకపోవడంతో ఇవి తేలికగా జీర్ణమవుతాయని పేర్కొంటున్నారు. సుమారు 4 నుంచి 5 గంటలు నానబెట్టడం సరిపోతుందని సూచిస్తున్నారు. పప్పులు నానబెట్టడం ఒక ఎంపిక కాదు, తప్పనిసరి అలవాటు కావాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడటంతో పాటు గట్ ఆరోగ్యం కూడా బాగుంటుందని తెలియజేస్తున్నారు. ఈ చిన్న అలవాటు వల్ల పొట్ట ఉబ్బరం తగ్గడం, పోషకాలు శరీరానికి మెరుగ్గా అందడం, భోజనం తిన్న తర్వాత తేలికగా అనిపించడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని సూచిస్తున్నారు. పప్పులు తిన్నప్పుడు జీర్ణ సమస్యలు వస్తున్నాయని భావించే వారు ముందుగా వాటిని నానబెట్టే విధానాన్ని పరిశీలించుకోవాలని చెబుతున్నారు.

# వేసవిలో ముఖంపై అధికంగా కనిపించే వైట్ హెడ్స్.. కారణాలు ఏంటి.. ఏం చేయాలి..?



వేసవి కాలంలో ముక్కుపై చిన్న చిన్న తెల్లని మొటిమలు ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. ఈ సమస్యను చాలా మంది ఎదుర్కొనే ఉంటారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో చర్మంలో ఆయిల్ ఉత్పత్తి కూడా అధికమవుతుంది. దీంతో ముఖ్యంగా ముక్కు భాగంలో వైట్‌హెడ్స్ ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి సాధారణ మొటిమల్లా కనిపించినా, సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇన్‌ఫ్లమేటరీ యాక్నేగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. వైట్‌హెడ్స్ అనేవి చర్మ రంధ్రాలు ఆయిల్, మృత చర్మ కణాలు, బ్యాక్టీరియాతో మూసుకుపోయినప్పుడు ఏర్పడతాయి. బ్లాక్‌హెడ్స్‌లా బయటకు తెరిచి ఉండకపోవడంతో ఇవి తెల్లని లేదా చర్మరంగు గడ్డల్లా కనిపిస్తాయి. ముఖ్యంగా వేసవిలో వేడి, చెమట, తేమ కలిసి ఈ సమస్యను మరింత పెంచుతాయి. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా చర్మంలోని సెబేషియస్ గ్రంథులు ఎక్కువగా ఆయిల్ ను విడుదల చేస్తాయి. ఈ అదనపు ఆయిల్ దుమ్ము, మృత కణాలతో కలిసిపోవడంతో రంధ్రాలు సులభంగా మూసుకుపోతాయి. ఫలితంగా ముక్కుపై వైట్‌హెడ్స్ ఎక్కువగా కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. చెమట కూడా ఈ సమస్యలో కీలక పాత్ర పోషిస్తుంది. శరీరాన్ని చల్లబరచడానికి చెమట అవసరమే అయినప్పటికీ, అధిక తేమ ఉన్న వాతావరణంలో అది సరిగా ఆవిరి కాక చర్మంపై మలినాలను బంధిస్తుంది. దీని వల్ల పోర్స్ మరింత బ్లాక్ అయ్యే అవకాశాలు పెరుగుతాయి. ముఖ్యంగా ముక్కు భాగం టీ–జోన్ లో ఉండటంతో అక్కడ ఆయిల్ గ్రంథులు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల ముక్కు భాగం సహజంగానే ఎక్కువ ఆయిలీగా ఉంటుంది. పైగా అక్కడి రంధ్రాలు కొంచెం పెద్దవిగా ఉండటం వల్ల మలినాలు త్వరగా పేరుకుపోయి మొటిమలకు దారితీస్తాయని చర్మ నిపుణులు వివరిస్తున్నారు. అలాగే ముఖాన్ని పదేపదే చేతులతో తాకడం, చెమట తుడుచుకోవడం కూడా బ్యాక్టీరియా వ్యాప్తికి కారణమవుతుంది. ఇది వైట్‌హెడ్స్‌ను మరింత తీవ్రమయ్యేలా చేస్తుందని చెబుతున్నారు. వైట్‌హెడ్స్ నివారణకు కఠినమైన ట్రీట్మెంట్స్ కంటే మృదువైన, క్రమబద్ధమైన చర్మ సంరక్షణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు రెండు సార్లు మైల్డ్ క్లెన్సర్‌తో ముఖాన్ని శుభ్రం చేయడం ద్వారా అదనపు ఆయిల్, దుమ్ము తొలగించవచ్చు.

# కేక్‌ల మీద వాడే క్రీమ్ డెయిరీనా, నాన్-డెయిరీనా అని తెలుసుకోవడం ఎలా..



పిల్లలతో పాటు పెద్దలు కూడా ఇష్టంగా తినే వాటిల్లో కేక్ ఒకటి. ప్రతి శుభకార్యంలో ఇప్పుడు కేక్ కట్టింగ్ తప్పనిసరైందని చెప్పవచ్చు. అయితే కేక్‌పై ఉండే క్రీమ్ నిజమైన డెయిరీ క్రీమా, లేక నాన్–డెయిరీ క్రీమా అనే సందేహం చాలా మందికి వస్తుంటుంది. బయటకు చూస్తే రెండూ ఒకేలా కనిపించినా, రుచి, టెక్స్చర్, తయారీ విధానం పరంగా ఇవి పూర్తిగా భిన్నమని ఫుడ్ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా భారతీయ బేకరీల్లో ఎక్కువగా ఉపయోగించే నాన్–డెయిరీ క్రీమ్ గురించి తెలుసుకోవడం వినియోగదారులకు ఉపయోగకరమని సూచిస్తున్నారు. సాధారణంగా విప్డ్ డెయిరీ క్రీమ్ ఆవు పాలతో తయారవుతుంది. ఇందులో కనీసం 30 శాతం వరకు పాల కొవ్వు ఉంటుంది. ఈ ఫ్యాట్ కారణంగానే క్రీమ్‌కు మృదువైన టెక్స్చర్, క్రీమీ ఫీలింగ్ వస్తాయి. విప్ చేసినప్పుడు గాలిని పట్టుకుని లైట్‌గా, ఫ్లఫీగా మారుతుంది. బ్రాండెడ్ బేకరీల్లో కనిపించే సాఫ్ట్ క్రీమ్ కేక్‌లలో సాధారణంగా ఇలాంటి డెయిరీ క్రీమ్ ఉపయోగిస్తారు.

**తేడా ఏమిటి..**

మరోవైపు నాన్–డెయిరీ క్రీమ్ పూర్తిగా వేరే ఉత్పత్తి. ఇది సాధారణంగా నీరు, హైడ్రోజనేటెడ్ వెజిటబుల్ ఆయిల్, కార్న్ సిరప్, స్టెబిలైజర్స్, ఎమల్సిఫైయర్స్ వంటి పదార్థాలతో తయారవుతుంది. ఇది డెయిరీ క్రీమ్‌లా కనిపించేందుకు ప్రత్యేకంగా తయారు చేస్తారు. అయితే ఇది సహజ పాల ఉత్పత్తి కాదని నిపుణులు వివరిస్తున్నారు. దేశంలో ఎక్కువ బేకరీలు నాన్–డెయిరీ క్రీమ్‌ను ఉపయోగించడానికి ప్రధాన కారణం వాతావరణమే. అధిక ఉష్ణోగ్రతల్లో డెయిరీ క్రీమ్ త్వరగా కరుగుతుంది. కానీ నాన్–డెయిరీ క్రీమ్ ఎక్కువసేపు ఆకారాన్ని నిలుపుకుంటుంది. కేక్ డెకరేషన్స్, డిజైన్స్ కూడా స్పష్టంగా కనిపిస్తాయి. డెలివరీ సమయంలో కూడా ఇది సులభంగా చెడిపోదు. కేక్‌పై ఉన్న క్రీమ్ ఏ రకమో కొన్ని లక్షణాల ద్వారా గుర్తించవచ్చని చెబుతున్నారు. డెయిరీ క్రీమ్ సాధారణంగా తేలికగా, మైల్డ్ స్వీట్‌గా ఉంటుంది. నోట్లో వేసుకున్న వెంటనే కరిగిపోతూ పాల రుచిని ఇస్తుంది. తిన్న తర్వాత ఆయిలీ ఫీలింగ్ ఉండదు. అదే నాన్–డెయిరీ క్రీమ్ అయితే ఎక్కువ తీపిగా ఉండటంతోపాటు కొంచెం ఆర్టిఫిషియల్ రుచి వస్తుంది. కొందరికి ఇది మైనం లాంటి లేదా ఆయిలీ ఫీలింగ్ ఇస్తుంది. తిన్న తర్వాత నాలుకపై కొద్దిసేపు కొవ్వు పొర ఉన్నట్టుగా అనిపిస్తుంది.

**రూపాన్ని చూసి చెప్పవచ్చు..**

క్రీమ్ రూపాన్ని చూసి కూడా కొంతవరకు అంచనా వేయొచ్చని చెబుతున్నారు. డెయిరీ క్రీమ్ కొంచెం మ్యాట్ ఫినిష్‌లో కనిపిస్తుంది. పైపింగ్ డిజైన్లు సాఫ్ట్‌గా ఉంటాయి. నాన్–డెయిరీ క్రీమ్ మాత్రం ఎక్కువ గ్లోసీగా, ప్లాస్టిక్ లుక్‌తో కనిపిస్తుంది. కేక్‌పై డిజైన్లు కూడా చాలా షార్ప్‌గా, గట్టిగా కనిపిస్తాయి. చేతికి తగిలినప్పుడు కూడా తేడా తెలుస్తుంది. డెయిరీ క్రీమ్ శరీర వేడితో త్వరగా కరుగుతుంది. నాన్–డెయిరీ క్రీమ్ మాత్రం కొంత గట్టిగా, మైనంలా ఉండి త్వరగా కరగదు. ప్యాకేజ్డ్ కేక్‌లలో అయితే ఇన్‌గ్రిడియెంట్స్ లిస్ట్ చూసి తెలుసుకోవచ్చు. క్రీమ్, డెయిరీ క్రీమ్ వంటి పదాలు ఉంటే అది పాల ఆధారిత క్రీమ్ అయ్యే అవకాశం ఉంది. వెజిటబుల్ ఫ్యాట్, నాన్–డెయిరీ టాపింగ్, పామ్ ఆయిల్, స్టెబిలైజర్స్ వంటి పదాలు ఉంటే అది నాన్–డెయిరీ క్రీమ్ అయ్యే అవకాశాలు ఉంటాయి. అయితే ఈ రెండింటిలో ఏదీ పూర్తిగా చెడు కాదు అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. డెయిరీ క్రీమ్ సహజమైన రుచి ఇస్తే, నాన్–డెయిరీ క్రీమ్ ఎక్కువ స్థిరత్వం కలిగి ఉంటుంది. ముఖ్యంగా లాక్టోజ్ అసహనం ఉన్నవారికి లేదా వెగన్ ఆహారం తీసుకునేవారికి నాన్–డెయిరీ క్రీమ్ ఉపయోగకరంగా ఉంటుంది. కేక్ కొనేటప్పుడు ఫ్రెష్ క్రీమ్ అంటే నిజంగా ఏ క్రీమ్ వాడుతున్నారో బేకరీని నేరుగా అడగడం మంచిది. రుచి, టెక్స్చర్, రూపం, లేబుల్ వంటి విషయాలను గమనిస్తే డెయిరీ, నాన్–డెయిరీ క్రీమ్‌ల మధ్య తేడాను సులభంగా గుర్తించవచ్చు.

# ప్రీడయాబెటిస్ ఉన్నవారికి విటమిన్ డి ఇస్తే మెరుగైన ఫలితాలు.. అధ్యయనంలో వెల్లడి..



ప్రస్తుత కాలంలో భారతదేశంలో ప్రీడయాబెటిస్ సమస్య వేగంగా పెరుగుతోంది. ఐసీఎంఆర్–ఇండియాబ్ అధ్యయనం ప్రకారం దేశ జనాభాలో సుమారు 15.3 శాతం మంది ప్రీడయాబెటిస్‌తో బాధపడుతున్నారు. ఇది దాదాపు 13.6 కోట్ల మందికి సమానం. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఈ పరిస్థితి టైప్–2 డయాబెటిస్‌గా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిక మోతాదులో విటమిన్–డి సప్లిమెంట్లు కొంతమందిలో డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తాయని తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ పరిశోధనను అమెరికాలోని టఫ్ట్స్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించారు. అధ్యయన ఫలితాలు జామా నెట్‌వర్క్ ఓపెన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

**రోజుకు ఎంత మోతాదులో ఇస్తే..**

పరిశోధకులు ముందుగా నిర్వహించిన డి2డి ట్రయల్ డేటాను మళ్లీ విశ్లేషించారు. ఇందులో పాల్గొన్న పెద్దలకి రోజుకు 4,000 ఐయూ విటమిన్–డి లేదా ప్లాసీబోను సుమారు రెండున్నరేళ్ల పాటు ఇచ్చారు. మొదటి దశలో జరిగిన డి2డి అధ్యయనంలో పాల్గొన్నవారిలో డయాబెటిస్ ప్రమాదం తగ్గినట్టు స్పష్టమైన ఫలితాలు కనిపించలేదు. అయితే తాజా విశ్లేషణలో కొన్ని ప్రత్యేక జన్యు లక్షణాలు ఉన్నవారికి విటమిన్–డి వల్ల ప్రయోజనం కలిగినట్టు గుర్తించారు. ఈ పరిశోధనలో భాగంగా 2,098 మంది పాల్గొన్నవారి డీఎన్ఏ నమూనాలను పరీక్షించారు. ముఖ్యంగా విటమిన్–డి రిసెప్టర్ (వీడీఆర్) జీన్లలో ఉండే మూడు సాధారణ వేరియంట్లను పరిశీలించారు. రక్త పరీక్షల ద్వారా ఫాస్టింగ్ గ్లూకోజ్ 126 ఎంజీ/డీఎల్ కంటే ఎక్కువగా ఉండటం, రెండు గంటల తర్వాత గ్లూకోజ్ 200 ఎంజీ/డీఎల్ దాటడం లేదా హెచ్‌బీఏ1సీ 6.5 శాతానికి మించితే డయాబెటిస్‌గా నిర్ధారించారు. అధ్యయనం ప్రకారం వీడీఆర్ జీన్‌లో ఏపాల్ ప్రాంతంలో ఏసీ లేదా సీసీ రకాల వేరియంట్లు ఉన్నవారిలో విటమిన్–డి సప్లిమెంట్లు తీసుకున్నప్పుడు డయాబెటిస్ ప్రమాదం సుమారు 19 శాతం వరకు తగ్గినట్టు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70 శాతం మందిలో ఈ వేరియంట్లు ఉండే అవకాశముందని పరిశోధకులు చెబుతున్నారు.

**అందరికీ వర్తించదు..**

అయితే ఏఏ వేరియంట్ ఉన్నవారిలో మాత్రం ఈ ప్రయోజనం కనిపించలేదని వెల్లడించారు. విటమిన్–డి శరీరంలో ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్యాంక్రియాస్‌లో ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాల్లో విటమిన్–డి రిసెప్టర్ ప్రోటీన్లు ఉంటాయి. ఇవి యాక్టివ్ విటమిన్–డితో కలిసి పనిచేస్తాయి. అయితే జీన్‌లలో ఉండే మార్పుల వల్ల ఈ ప్రక్రియ ప్రభావితం అవుతుందని పరిశోధకులు వివరిస్తున్నారు. అధ్యయనంలో ఉపయోగించిన 4,000 ఐయూ విటమిన్–డి మోతాదు సాధారణంగా సూచించే రోజువారీ 600 నుంచి 800 ఐయూ కంటే చాలా ఎక్కువ. అయినప్పటికీ ట్రయల్ సమయంలో తీవ్రమైన దుష్ప్రభావాలు కనిపించలేదని పరిశోధకులు పేర్కొన్నారు.

**వైద్యుల సలహా లేకుండా వద్దు..**

అయితే వైద్యుల సలహా లేకుండా అధిక మోతాదులో విటమిన్–డి ని తీసుకోవద్దని హెచ్చరిస్తున్నారు. అధికంగా తీసుకుంటే విటమిన్–డి టాక్సిసిటీ ప్రమాదం ఉంటుందని సూచిస్తున్నారు. భవిష్యత్తులో ప్రీడయాబెటిస్ ఉన్నవారిలో ఎవరికి విటమిన్–డి సప్లిమెంట్లు ఎక్కువ ప్రయోజనం ఇస్తాయో జన్యు పరీక్షల ద్వారా ముందుగానే గుర్తించే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. ఇది వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్సలు అందించే పర్సనలైజ్డ్ మెడిసిన్ దిశగా ఒక ముందడుగుగా భావిస్తున్నారు. అయితే నిపుణులు జీవనశైలినే అత్యంత కీలక అంశంగా పేర్కొంటున్నారు. సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం, యోగా, బరువు నియంత్రణ వంటి అలవాట్లు డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు. విటమిన్–డి సప్లిమెంట్లు కొన్ని జన్యు లక్షణాలు ఉన్నవారికి అదనపు రక్షణగా ఉపయోగపడే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

## బిజినెస్

### తగ్గిన ఓలా ఎలక్ట్రిక్ నష్టం.. తొలిసారి పాజిటివ్ క్యాష్ ఫ్లో




**న్యూఢిల్లీ:** ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ఓలా ఎలక్ట్రిక్ గత ఆర్థిక సంవత్సరం (2025--26) నాలుగో త్రైమాసికం (క్యూ4)లో రూ.500 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని ప్రకటించింది. అయితే, అంతక్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో నమోదైన రూ.870 కోట్ల నష్టంతో పోలిస్తే ఈసారి నష్టం 42.5 శాతం తగ్గింది. ఆదాయం 57 శాతం క్షీణించి రూ.611 కోట్ల నుంచి రూ.265 కోట్లకు దిగజారింది. ఆదాయం తగ్గినా, స్థూల మార్జిన్లు మెరుగయ్యాయి. ఇవి వార్షిక ప్రాతిపదికన 13.7% నుంచి 38.5 శాతానికి చేరాయి. పీఎల్ఐ ప్రోత్సాహకాలు, మెరుగైన స్థూల మార్జిన్లు, కఠినమైన వ్యయ నియంత్రణ కారణంగా కంపెనీ చరిత్రలో తొలిసారిగా కార్యకలాపాల నగదు ప్రవాహం పాజిటివ్‌గా మారి క్యూ4లో రూ.91 కోట్లుగా నమోదైంది. ఆటోమొబైల్ వ్యాపారం నుంచి రూ.213 కోట్ల ఆపరేటింగ్ క్యాష్ ఫ్లో, రూ.173 కోట్ల ఫ్రీ క్యాష్ ఫ్లో (ఎఫ్‌సీఎఫ్) నమోదయ్యాయి. మార్చి త్రైమాసికంలో మొత్తం 20,256 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను కంపెనీ విక్రయించింది. ఇక పూర్తి 2025--26 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ మొత్తం రూ.2,253 కోట్ల ఆదాయాన్ని ఆర్జించగా.. రూ.1,833 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం మొత్తంలో ఓలా ఎలక్ట్రిక్ మొత్తం 1,73,794 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను డెలివరీ చేసింది.

### ఐపీఎల్ వెలుగులో బెట్టింగ్ 'చీకటి ఆట'!

ఐపీఎల్ సీజన్‌ను ఆసరాగా చేసుకుని భారతీయ క్రికెట్ అభిమానులను పెద్ద ఎత్తున ముంచేస్తున్న ఒక భారీ అక్రమ బెట్టింగ్ నెట్‌వర్క్‌ను ప్రముఖ సైబర్ ఇంటెలిజెన్స్ సంస్థ 'క్లౌడ్‌సెక్' బట్టబయలు చేసింది. క్లోన్-స్క్రిప్ట్ ప్లాట్‌ఫారమ్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డీప్‌ఫేక్స్, హ్యాక్ చేసిన ప్రభుత్వ వెబ్‌సైట్లు, మనీ లాండరింగ్ నెట్‌వర్క్‌ల సహాయంతో ఈ ముఠా ఇంతటి భారీ దోపిడీకి పాల్పడుతున్నట్లు సంస్థ తన తాజా పరిశోధనలో వెల్లడించింది. గత వారమే ఐపీఎల్ వీక్షకులను లక్ష్యంగా చేసుకుని నడుస్తున్న నకిలీ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్‌లను గుర్తించిన క్లౌడ్‌సెక్, తాజాగా ఈ అక్రమ బెట్టింగ్ ఎకానమీ వెనుక ఉన్న చీకటి ప్రపంచాన్ని పూర్తిగా మ్యాప్ చేసింది. 1,200కు పైగా నకిలీ డొమైన్లు: ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫారమ్‌లను ప్రోత్సహించడానికి 1,200 కంటే ఎక్కువ వెబ్‌సైట్ డొమైన్లు యాక్టివ్‌గా పనిచేస్తున్నట్లు క్లౌడ్‌సెక్ గుర్తించింది. ఒక్క బ్యాకెండ్.. 25 వెబ్‌సైట్లు: పరిశోధకులు ఒక అక్రమ ప్లాట్‌ఫారమ్ అడ్మిన్ ప్యానెల్‌ను యాక్సెస్ చేయగా, కేవలం ఒకే ఒక్క బ్యాకెండ్ సిస్టమ్ నుండి 25కు పైగా వేర్వేరు బెట్టింగ్ వెబ్‌సైట్లను నడుపుతున్నట్లు తేలింది. దీని ద్వారా యూజర్ల డిపాజిట్లు, బెట్టింగులు, విత్‌డ్రా రిక్వెస్ట్‌లను నిందితులు పూర్తిగా నియంత్రిస్తున్నారు. రూ. 4.65 కోట్ల విత్‌డ్రా నిరాకరణ: మే 2025 నుండి మే 2026 మధ్య కాలంలో, ఈ ఒక్క ప్లాట్‌ఫారమ్‌లోనే వినియోగదారులు చేసుకున్న 9,300 లకు పైగా డబ్బు విత్‌డ్రా రిక్వెస్ట్‌లను ఏజెంట్లు ఉద్దేశపూర్వకంగా తిరస్కరించారు.

## ఫోర్బ్స్ బిలియనీర్స్.. జాబితాలో 229 మంది భారతీయులు!

ఇంటర్నేషనల్ మార్కెట్‌లో రూపాయి విలువ క్షీణించినప్పటికీ భారత బిలియనీర్‌లు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితా-2026 ప్రకారం.. భారత్ నుంచి రికార్డు స్థాయిలో 229 మంది జాబితాలో చోటు దక్కించుకున్నారు. వీరి మొత్తం ఆస్తుల విలువ తొలిసారి లక్ష కోట్ల డాలర్ల మార్కును దాటడం విశేషం. ఈసారి రికార్డు స్థాయిలో 30 మంది కొత్తవారు ఈ జాబితాలోకి ఎంట్రీ ఇచ్చారు. భారత్‌లోనే కాకుండా ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా ముకేశ్ అంబానీ తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. మొత్తం 99.7 బిలియన్ డాలర్ల సంపదతో ఆయన దేశంలో మొదటి స్థానంలో ఉండగా మౌలిక సదుపాయాల రంగ దిగ్గజం గౌతమ్ అదానీ 63.8 బిలియన్ డాలర్ల ఆస్తితో రెండో స్థానంలో ఉన్నారు. దేశవ్యాప్తంగా ఏఐ మౌలిక సదుపాయాలను నిర్మించేందుకు ఈ రెండు గ్రూపులు కలిపి ఏకంగా 210 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించాయి. ఇక ఓపీ జిందాల్ గ్రూప్ అధినేత్రి సావిత్రి జిందాల్ 39.1 బిలియన్ డాలర్ల సంపదతో దేశంలోనే అత్యంత ధనవంతురాలైన మహిళగా నిలిచారు. ఓవరాల్‌గా ఆమెకు మూడో స్థానం దక్కింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ 14.4 బిలియన్ డాలర్ల ఆస్తితో పదో స్థానంలో నిలిచి ఈ టాప్ గ్రూపులోకి ప్రవేశించారు. భారతీయ ఎడ్‌టెక్ రంగంలో ఈసారి సరికొత్త సంచలనం నమోదైంది. ప్రముఖ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్ 'ఫిజిక్స్ వాలా' కో-ఫౌండర్లు అలఖ్ పాండే, ప్రతీక్ బూబ్ ఈసారి బిలియనీర్ల జాబితాలో స్థానం సంపాదించారు. గత ఏడాది నవంబర్‌లో వచ్చిన తమ కంపెనీ ఐపీఓ సూపర్ హిట్ కావడంతో ఈ ఇద్దరు కుబేరుల క్లబ్‌లోకి అడుగుపెట్టారు. ఇక ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకున్న అత్యంత పిన్న వయస్కుడైన భారతీయుడిగా



అరవింద్ శ్రీనివాస్ (31) రికార్డు సృష్టించారు. జెఫ్ బెజోస్ మద్దతుతో నడుస్తున్న 'పెర్‌ప్లెక్సిటీ' ఏఐ సెర్చ్ స్టార్టప్ కో-ఫౌండర్ అయిన ఈయన శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉంటున్నారు. కొన్నేళ్ల విరామం తర్వాత 'పేటీఎమ్' వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ మళ్లీ బిలియనీర్ల జాబితాలోకి పునరాగమనం చేశారు. మరోవైపు 'ఓలా క్యాబ్స్' ఫౌండర్ భవీష్ అగర్వాల్‌తోపాటు మరో ఏడుగురు ఈసారి బిలియనీర్ల హోదాను కోల్పోయారు.

**భారత టాప్-10 బిలియనీర్‌లు వీళ్లే..**

1. ముకేశ్ అంబానీ - 99.7 బిలియన్ డాలర్‌లు, 2. గౌతమ్ అదానీ - 63.8 బిలియన్ డాలర్‌లు, 3. సావిత్రి జిందాల్ - 39.1 బిలియన్ డాలర్‌లు, 4. లక్ష్మీ మిట్టల్ - 31.0 బిలియన్ డాలర్‌లు, 5. శివ్ నాడార్ - 30.9 బిలియన్ డాలర్‌లు, 6. సైరస్ పూనావాలా - 27.0 బిలియన్ డాలర్‌లు, 7. దిలీప్ సంఘ్వీ - 25.6 బిలియన్ డాలర్‌లు, 8. కుమార్ బిర్లా - 21.1 బిలియన్ డాలర్‌లు, 9. రాధాకిషన్ దమానీ - 15.7 బిలియన్ డాలర్‌లు, 10. ఉదయ్ కోటక్ - 14.4 బిలియన్ డాలర్‌లు.

## నష్టాల్లో ముగిసిన భారతీయ స్టాక్ మార్కెట్.. సెన్సెక్స్ 135, నిఫ్టీ 5 పాయింట్లు పతనం

భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 135.03 పాయింట్లు నష్టపోయి, 75,183.36 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా స్వల్పంగా.. అంటే 4.30 పాయింట్లు నష్టపోయి 23,789 పాయింట్ల వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ లాభాల్లోనే కొనసాగింది. సెన్సెక్స్ ఒకదశలో 500 పాయింట్లు పెరిగింది. ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్ చివరికి నష్టాల్లో ముగిసింది. క్రూడాయిల్ ధరలు తగ్గడం, ఇరాన్‌తో చర్చలు జరుగుతాయని ట్రంప్ ప్రకటించడం ఉదయం మార్కెట్‌కు కలిసొచ్చింది. ఆర్బీఐ రేట్లు పెంచుతుందనే భయం, ద్రవ్యోల్బణం పెరుగుదల, అంతర్జాతీయ పరిణామాలు వంటివి మార్కెట్ నష్టాలకు కారణాలు. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లపై ఒత్తిడి పెరగడంతో మార్కెట్ ప్రభావితమైంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, హిందుస్తాన్ యునీలీవర్ షేర్లు నష్టపోయాయి. అల్ట్రాటెక్, ఇండిగో, అదానీ పోర్ట్స్, ట్రెంట్, బీఈఎల్ షేర్లు లాభాలు చవిచూశాయి. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.63 శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర స్వల్పంగా తగ్గింది. బ్యారెల్ క్రూడాయిల్ ధర 104 డాలర్ల వద్ద కొనసాగింది. బంగారం ఔన్స్ ధర 4518 డాలర్ల వద్ద కొనసాగింది. మరోవైపు గురువారం రూపాయి స్వల్పంగా



లాభపడింది. డాలర్‌తో రూపాయి 63 పైసలు బలపడి 96.23కు చేరింది.

## నిరాశపరిచారు టీమిండియా సెలక్టర్లపై విమర్శలు

టీమిండియా సెలక్షన్ కమిటీ తీరును ప్రముఖ కామెంటేటర్ హర్షా భోగ్లే విమర్శించాడు. దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటే ఆటగాళ్లను విస్మరించడం ఎంతమాత్రం తగదన్నాడు. అఫ్గనిస్తాన్‌తో ఏకైక టెస్టుకు జమ్మూ కశ్మీర్ ఎక్స్‌ప్రెస్ ఆకిబ్ నబీని ఎంపిక చేయకపోవడం తనను తీవ్రంగా నిరాశపరిచిందని ఈ సందర్భంగా పేర్కొన్నాడు. ఐపీఎల్-2026 ముగిసిన వెంటనే భారత జట్టు అంతర్జాతీయ క్రికెట్ (జూన్ 6 నుంచి)తో బిజీ కానుంది. ఇందులో భాగంగా తొలుత స్వదేశంలో అఫ్గనిస్తాన్ ఒక టెస్టు, మూడు వన్డేలు ఆడనుంది. ఇందుకు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) జట్లను ప్రకటించింది.

**గుర్నూర్ బ్రార్‌కు తొలిసారి పిలుపు**

ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతినివ్వగా.. గుర్నూర్ బ్రార్ తొలిసారి టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నాడు. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణతో కలిసి పేస్ దళంలో చేరాడు. అయితే, మెజారిటీ మంది విశ్లేషకులు అఫ్గన్‌తో టెస్టుకు ఆకిబ్ నబీని తప్పక ఎంపిక చేస్తారని భావించారు. కానీ సెలక్టర్లు మాత్రం అతడికి మొండిచేయి చూపారు. ఈ నేపథ్యంలో ఆకిబ్ నబీ పట్ల సెలక్షన్ కమిటీ వ్యవహారశైలిపై హర్ష్ భోగ్లే అసంతృప్తి వ్యక్తం చేశాడు. "ఈ జట్టులో ఆకిబ్ నబీ తప్పక ఉంటాడని నేను విశ్వసించాను. అతడి గురించి చర్చ కూడా




జరిగింది.

**అతడిని ఎందుకు ఎంపిక చేయలేదు?**

అతడి బౌలింగ్‌లో తగినంత పేస్ ఉందా? లేదా? అన్న విషయంతో నాకు సంబంధం లేదు. బౌలింగ్ చేస్తున్న సమయంలో అతడు బ్యాలెన్స్ చేసుకుంటున్నాడా? లేదా? అన్నది కూడా నాకు అక్కర్లేదు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో రెండేళ్లలో అతడు వందకు పైగా వికెట్లు కూల్చాడు. అలాంటి బౌలర్‌కు ప్రోత్సాహం అందించడం కనీస బాధ్యత. అతడిని ఎంపిక చేసి ఉంటే దేశీ క్రికెట్లో సత్తా చాటే ఆటగాళ్లకు మంచి బూస్టప్ లభించేది. టెస్టుల్లో రాణించాలనే కసి మరింత పెరిగేది. అఫ్గన్‌తో టెస్టులో తుదిజట్టులో ఆకిబ్ నబీకి చోటు ఇవ్వకున్నా పర్లేదు. కానీ పదిహేను మంది సభ్యుల జట్టుకు మాత్రం అతడిని ఎంపిక చేయాల్సింది. అతడికి ఫిట్‌నెస్ సమస్యలు కూడా లేవు.

**ఏం మెసేజ్ ఇస్తు న్నారు?**

దేశీ క్రికెట్లో ఓ బౌలర్‌గా ఎంతగా రాణించాలో.. అంతా చేసి చూపాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో తొమ్మిదో స్థానంలో మెరుగ్గా ఆడగలడు. అయినప్పటికీ అతడిని ఎంపిక చేయకపోవడం నిజంగా నిరాశాజనకం. ఈ సెలక్షన్ కమిటీకి ఆకిబ్ నబీని ఎంపిక చేయకపోవడానికి గల కారణాలు ఎన్నో ఉండి ఉంటాయి. కానీ వారి చర్యల ద్వారా ఇచ్చే సందేశం మాత్రం సరిగ్గా లేదు" అని హర్షా భోగ్లే యూట్యూబ్ చానెల్ వేదికగా తన అభిప్రాయాలు పంచుకున్నాడు. కాగా 2025-26 సీజన్‌లో పది మ్యాచ్‌లలో ఆకిబ్ నబీ జమ్మూ కశ్మీర్ తరఫున 60 వికెట్లు తీశాడు. తన జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఇక అంతకుముందు సీజన్లో ఆకిబ్.. 44 వికెట్లతో సత్తా చాటాడు.

### పాండ్యాకు మ్యాచ్ ఫీజులో భారీ కోత.. ఒక డీమెరిట్ పాయింట్..!

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో నాయకుడిగా, ఆటగాడిగా దారుణంగా విఫలమైన హార్దిక్ పాండ్యాకు జరిమానా పడింది. ఐపీఎల్ నియమావళిని ఉల్లఘించినందుకు అతడు మ్యాచ్ ఫీజులో 10 శాతం కోల్పోనున్నాడు. మ్యాచ్ సమయంలో క్రికెట్ వస్తువులు(బ్యాట్, బంతి, వికెట్లు, గ్లోవ్స్, బెయిల్స్) పట్ల దురుసుగా ప్రవర్తించినందుకు అతడికి రిఫరీ రాజీవ్ సేథ్ జరిమానా విధించాడు. అసలేం జరిగిందంటే.. ఈడెన్ గార్డెన్స్‌లో బుధవారం కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్ ఢీకొన్నాయి. కోల్‌కతా ఇన్నింగ్స్ సమయంలో 10వ ఓవర్ వేసిన పాండ్యా.. నాలుగో బతికి రనప్ కోసం నడుచుకుంటూ వెళ్తూ చేతితో బెయిల్స్‌ను నెట్టేస్తున్నట్టు బలంగా తాకాడు. దాంతో, అవి కిందపడిపోయాడు. అతడి చర్యను తీవ్రంగా పరిగణించిన పాండ్యాను విచారణకు పలిచాడు రిఫరీ రాజీవ్ సేథ్. ఐపీఎల్ నియమావళిలోని ఆర్టికల్ 2.2ను పాండ్యా ఉల్లంఘించాడని రిఫరీ తెలుపగా.. తాను నేరం



చేశానని ముంబై కెప్టెన్ అంగీకరించాడు. దాంతో, రిఫరీ అతడికి మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించాడు. ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించాడు. కోల్‌కతా చేతిలో ఘోర ఓటమి అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీజన్ ఆసాంతం పేలవ ఫీల్డింగ్ తమ కొంపముంచిందని పాండ్యా తెలిపాడు.

**రాజస్థాన్ రాయల్స్‌తో**

ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ 19వ సీజన్‌లో అనూహ్య తడబాటుతో ప్లే ఆఫ్స్ నుంచి నిష్క్రమించింది. లీగ్ దశను హ్యాట్రిక్ విజయాలతో ముగిద్దామనుకుంటే కోల్‌కతా నైట్ రెడర్స్ ముంబైని దెబ్బకొట్టింది. ఈడెన్ గార్డెన్స్‌లో హార్దిక్ పాండ్యా బృందాన్ని 147కే నిలువరించిన కేకేఆర్ స్వల్ప లక్ష్యాన్ని 18.5 ఓవర్లలోనే ఛేదించి నాకౌట్ అవకాశాల్ని మెరుగుపరచుకుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో మే 24న ముంబై తలపడనుంది.

## స్పోర్ట్స్

### ఒకప్పుడు కలిసి ఆడారు.. ఇప్పుడు గురు-శిష్యులుగా..!



ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభానికి ముందే నొవాక్ జకోవిచ్ కొత్త కోచ్‌ను నియమించుకున్నాడు. ఏడాది కాలంగా కోచ్ లేకుండానే ఆడుతున్న జొకో సెర్బియాకే చెందిన విక్టర్ ట్రాయ్‌స్కీ (ఎఱనిశీతీ ఎతీశీఱఎఎఱ)ను హెడ్‌కోచ్‌గా పరిచయం చేశాడు. ఒకప్పుడు స్నేహితులైన ఈ ఇద్దరూ ఇప్పుడు గురు శిష్యులుగా కొత్త ప్రయాణం మొదలెట్టనున్నారు. విక్టర్‌ను కోచ్‌గా తీసుకున్న విషయాన్ని బుధవారం జకోవిచ్ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా వెల్లడించాడు. రెండేళ్ల క్రితమే 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన జకోవిచ్.. 25వ ట్రోఫీ కోసం నిరీక్షిస్తున్నాడు. మే 22న 39వ వసంతంలో అడుగుపెట్టనున్న ఈ స్టార్ ఆటగాడు.. కొన్నిరోజులుగా ఊరిస్తున్న 25వ గ్రాండ్‌స్లామ్ గెలవాలనే కసితో ఉన్నాడు. అందుకోసం.. ఈ తరం కుర్రాళ్లు జన్నిక్ సిన్నర్, అల్కరాజ్‌లను ధీటుగా ఎదుర్కొనేందుకు, తన ఆటను మరింత సానబెట్టుకునేందుకు అతడు కొత్త కోచ్‌ను నియమించుకున్నాడు. ఒకప్పుడు స్నేహితుడు, సహచరుడు అయిన విక్టర్ ట్రాయ్‌స్కీని నూతన కోచ్‌గా అందరికీ పరిచయం చేశాడు జకో. 'నా స్నేహితుడు, సహచరుడు, ఇప్పుడు కోచ్. విక్టర్ టాయ్‌స్కీకి స్వాగతం' అని ఇన్‌స్టాగ్రామ్‌లో జకోవిచ్ పోస్ట్ పెట్టాడు. రొలాండ్ గరోస్ టోర్నమెంట్‌తో గురు శిష్యులుగా వీరిద్దరి జర్నీ మొదలవ్వనుంది. మాజీ టెన్నిస్ ఆటగాడైన విక్టర్‌కు ప్రస్తుతం 40 ఏళ్లు. జకోవిచ్‌తో కలిసి సెర్బియా జట్టుకు పదేళ్లకు పైగా కలిసి ఆడిన విక్టర్ వీడ్కోలు అనంతరం కోచ్ అవతారమెత్తాడు. జకో కోచింగ్ బృందంలో ఒకడిగా చేరిన విక్టర్.. అతడి ఒలింపిక్ పసిడి కలను సాకారం చేశాడు. ఈసారి హెడ్‌కోచ్‌గా వచ్చిన విక్టర్ తన శిష్యుడికి 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కట్టబెట్టాలనే పట్టుదలతో ఉన్నాడు. మే 24 ఆదివారం నుంచి ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభమవ్వనుంది.

AKSHARA SAAVAL PRINTED PUBLISHED EDITED AND OWNED BY BADAVATH BALAJI PRINTED AT H.NO.-1-9-1296/5/B/A/1, NEW SHAYAMPET, KAZIPET MANDAL, HANUMAKONDA, TELANGANA-506001,EDITOR B.BALAJI CELL:8096677136 H.NO.-45/12/151, INDIRA NAGAR, MANDAL GEESUGONDA, WARANGAL TELANGANA-506013_ **RNI** :TEL TEL / 2023/ 84132